APTEL/25/A2082

# పతాకం న్యూస్

PATHAKAM NEWS TELEGU DAILY // తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 174 | విశాఖపట్నం | 26-3-2026 గురువారం | చీఫ్ ఎడిటర్ : ఎల్. కృష్ణరావు | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 174 | VISAKHAPATNAM | 26-3-2026 THURSDAY | CHIEF EDITOR: L.KRISHNA RAO | Pages:8 | Rate: Rs.5/-

Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram



## చంద్రబాబుకు భయపడొద్దు: జగన్



**తాడేపల్లి, పతాకం న్యూస్:** వైసీపీ అధినేత జగన్ ప్రకాశం జిల్లా అద్దంకి నియోజకవర్గ పార్టీ నేతలతో కీలక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వంపై, ముఖ్యంగా సీఎం చంద్రబాబుపై ఆయన నిప్పులు చెరిగారు. పాలనలో అంతా తనదే అన్నట్టుగా చంద్రబాబు వ్యవహరిస్తున్నారని, ప్రతి చిన్న విషయంలో 'క్రెడిట్ చోరీ' చేస్తున్నారని మండిపడ్డారు. ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ మన హయాంలోనే రాష్ట్రానికి వచ్చిందని, కానీ ఇప్పుడు తన వల్లే వచ్చినట్టుగా చంద్రబాబు 'బిల్డప్' ఇస్తున్నారని జగన్ ఎద్దేవా చేశారు. గూగుల్ విషయంలోనూ ఇదే జరిగిందని, మాటలు కోటలు దాటుతున్నా చేతల్లో ఏమీ లేదని విమర్శించారు. రాబోయే రోజుల్లో పార్టీని సరికొత్తగా తీర్చిదిద్దుతామని, 'జగన్ 2.0'లో కార్యకర్తలకు అత్యంత ప్రాధాన్యత ఉంటుందని హామీ ఇచ్చారు. నేతలెవరూ చంద్రబాబును చూసి భయపడాల్సిన అవసరం లేదని, ఆ రోజులు పోయాయని ధైర్యం చెప్పారు.




2లో

### సెక్రటేరియట్ అధికారులకు ఐకానిక్ టవర్లు: నారాయణ



5లో

### జీవీఎంసీలో 120కి పెరగనున్న వార్డులు!



6లో

### డయాబెటిస్ ఉన్నవారు వ్యాయామం చేసే విషయంలో జాగ్రత్తలు పాటించాలి..?





### ఏపీ రాజధానిగా అమరావతి చట్టబద్ధతకు

# 28న అసెంబ్లీ ప్రత్యేక సమావేశం

- అమరావతిని రాష్ట్ర రాజధానిగా ప్రకటిస్తూ తీర్మానం చేయనున్న అసెంబ్లీ
- తీర్మానాన్ని కేంద్ర ప్రభుత్వానికి పంపనున్న రాష్ట్ర ప్రభుత్వం
- ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే అమరావతిపై కేంద్రం తుది నిర్ణయం తీసుకునే అవకాశం

**అమరావతి, పతాకం న్యూస్:** రాజధాని అమరావతికి చట్టబద్ధతతో పాటు చట్ట భద్రత కలిగించే దిశగా వడివడిగా అడుగులు పడుతున్నాయి. ఇందుకోసం తీర్మానం చేసి కేంద్రానికి పంపించేందుకు ఈనెల 28న రాష్ట్ర అసెంబ్లీ ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. ప్రస్తుతం పార్లమెంట్ సమావేశాల్లోనే దీనిపై తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. అమరావతిని ఏపీ రాష్ట్ర రాజధానిగా ప్రకటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీర్మానం చేయనుంది. ఈనెల 28న ఇందుకోసం ప్రత్యేకంగా అసెంబ్లీ సమావేశం ఏర్పాటు చేశారు. ఆ రోజున అసెంబ్లీలో ఈ విషయంపై చర్చించి తీర్మానం చేయనున్నారు. అనంతరం ఈ తీర్మానాన్ని కేంద్ర ప్రభుత్వానికి పంపించనున్నారు. తదుపరి కేంద్ర కేబినెట్ ముందుకు ఈ అంశం వెళ్లే అవకాశం ఉంది. కేంద్ర మంత్రిమండలి ఆమోదం పొందిన తరువాత, ప్రస్తుతం కొనసాగుతున్న పార్లమెంట్ సమావేశాల్లోనే దీనిపై తుది నిర్ణయం తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఏపీ రాష్ట్ర విభజన చట్టంలోని 5(2)కి సవరణ చేసేందుకు కేంద్రం కొద్దిరోజుల కిందటే చర్యలు ప్రారంభించింది. దీనికి ఇప్పటికే న్యాయశాఖ ఆమోదముద్ర లభించింది. రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేసి పంపిన తర్వాత కేంద్ర మంత్రివర్గం ఆమోదించనుంది. ఆ తర్వాత పార్లమెంటులో ప్రవేశపెట్టనున్నారు. అక్కడ ఆమోదం తర్వాత ఆంధ్రప్రదేశ్ నూతన రాజధానిగా అమరావతిని ప్రకటిస్తూ రాజపత్రం విడుదల చేస్తారు.

విభజన తర్వాత ఏపీ రాజధానిగా అమరావతిని తెలుగుదేశం ప్రభుత్వం ఎంపిక చేసింది. 29 గ్రామాల రైతులు ముందుకొచ్చి 34 వేల ఎకరాలు స్వచ్ఛందంగా ఇచ్చారు. సింగపూర్ ప్రభుత్వ సహకారంతో మాస్టర్‌ప్లాన్ రూపొందించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలోనే అక్కడ అసెంబ్లీ, సచివాలయ భవనాలు నిర్మించి పాలన ప్రారంభించారు. పెద్దఎత్తున రహదారులు, భవనాల నిర్మాణం మొదలైంది. 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడంతో అమరావతి పనులు నిలిచిపోయాయి. నాటి సీఎం జగన్ మూడు రాజధానుల ప్రతిపాదన తెచ్చారు. అమరావతిపై వైఎస్సార్‌సీపీ నేతలు తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు. రైతులను ఇబ్బంది పెట్టారు. అసలు అమరావతి అభివృద్ధి దిశగా ఎలాంటి చర్యలు అప్పటి ప్రభుత్వం తీసుకోలేదు. దీంతో అమరావతి రైతులు ఉద్యమించారు. భిన్న రూపాల్లో పోరాటం చేసి అంతిమంగా గెలుపు సాధించారు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అమరావతికి మళ్లీ వెలుగులొచ్చాయి. రూ.వేల కోట్లతో పనులు ప్రారంభించారు. అమరావతికి భవిష్యత్తులో ఇబ్బందులు ఎదురుకాకుండా విభజన చట్టంలో సవరణ చేసేలా చూస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చారు. ఏపీ రాజధానిగా అమరావతిని నోటిఫై చేస్తూ పార్లమెంటు ద్వారా విభజన చట్టంలో సవరణ చేయాలని కేంద్రాన్ని కోరారు. ఆ దిశగా ప్రస్తుతం అడుగులు పడుతున్నాయి. పార్ట్-2 కింద 5(1) : నిర్ణయించిన తేదీ నుంచి పదేళ్లకు మించకుండా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్ ఉంటుంది. పార్ట్-2 కింద 5(2) : సబ్ సెక్షన్ 5(1)లో పేర్కొన్న గడువు ముగిసిన తర్వాత తెలంగాణ రాజధానిగా హైదరాబాద్ కొనసాగుతుంది. ఆంధ్రప్రదేశ్‌కు నూతన రాజధాని ఏర్పాటవుతుంది. (తరువాయి 2వ పేజీలో)

## ఏపీలో గ్యాస్ కొరత లేదు: నాదెండ్ల





**అమరావతి, పతాకం న్యూస్:** ఏపీలో ఎక్కడా గ్యాస్ కొరత లేదని మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. సోషల్ మీడియాలో వచ్చే వదంతులతో కొందరు ముందు జాగ్రత్తగా బుకింగ్లు చేస్తున్నారని చెప్పారు. పైప్డ్ గ్యాస్పై కొత్త పాలసీ తీసుకువచ్చేలా ప్రభుత్వం త్వరలో నిర్ణయం తీసుకుంటుందన్నారు. "వాణిజ్య అవసరాలకు ఇచ్చే గ్యాస్ సరఫరాను కేంద్రం పెంచింది. రెస్టరెంట్లు, విద్యా సంస్థలకు సరఫరా పెంచేలా చర్యలు తీసుకుంటున్నాం. పట్టణాల్లో ప్రజలు పైప్డ్ గ్యాస్ కోసం నమోదు చేసుకోవచ్చు. సోలార్, ఇండక్షన్ కుకింగ్ స్టవ్లను వినియోగించేలా చర్యలు తీసుకుంటున్నాం. సిలిండర్లను బ్లాక్ మార్కెట్లో అమ్మకుండా ప్రత్యేక తనిఖీలు చేస్తున్నాం. అక్రమాలపై 800 కేసులు నమోదు చేసి 3,540 సిలిండర్లు సీజ్ చేశాం. బ్లాక్ మార్కెటింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. కచ్చితంగా వన్ టైమ్ పాస్వర్డ్ ద్వారానే గ్యాస్ సరఫరా జరపాలని ఆదేశాలిచ్చాం. అర్హత లేని వారి చేతుల్లోకి సిలిండర్లు వెళ్లకుండా చూసుకునే బాధ్యత మాపై ఉంది. పట్టణాల్లోని ప్రజలు పైప్డ్ గ్యాస్ కోసం నమోదు చేసుకోవచ్చు. పట్టణాల్లోని వినియోగదారులను ఎల్పీజీ నుంచి పీఎన్జీ వైపు మళ్లిస్తామని' అన్నారు.

# శాస్త్రి ఓ శాస్త్రి అవినీతి అనకొండ!

### డబ్బులు కొట్టు అక్రమ ప్లాన్ తీసుకో.. టౌన్ ప్లానింగ్ అధికారుల దారి దోపిడీ



- మాస్టర్ ప్లాన్ 190 ఉంటే.. రోడ్డుకే ప్లాన్ ఇచ్చేసిన జీవీఎంసీ అధికారులు
- 100 అడుగుల రోడ్డులో రోడ్డునే షాపింగ్ కాంప్లెక్స్‌గా కట్టేస్తున్న అక్రమార్కులు!
- రోడ్డులో ప్లాన్ ఇవ్వటానికి ఎన్ని లక్షలు తీసుకున్నారో నిగ్గు తెల్చాలి అంటున్న ఆర్టీఐ కార్యకర్త
- డబ్బులు ఇస్తే ఏదైనా చేసేస్తారా.. ఓ జీవీఎంసీ అధికారుల్లారా...
- లంచాలకు మంచాలు ఎక్కుతున్న టౌన్ ప్లానింగ్ అధికారులు!!
- ఏసీబీ అధికారులు రైడ్స్ జరిగిన బయటపడని టౌన్ ప్లానింగ్ అధికారులు
- సింహపూరి కొలనీలో రోడ్డు మీద షాపింగ్ కాంప్లెక్స్ కట్టేస్తున్న అక్రమార్కులు
- లక్షలాది రూపాయలు ముడుపులు తీసుకొని ప్లాన్ అప్రూవల్స్ ఇచ్చేస్తున్నా జోన్2 అధికారులు!
- అక్రమ కట్టడాలుపై చర్యలు లేకపోతే కోర్టుకి వెళ్తాను అంటున్న ఆర్టీఐ కార్యకర్త
- టౌన్ ప్లానింగ్ అధికారులతో పాటు అక్రమ బిల్డింగ్‌పై కోర్టుకు వెళ్లి నిగ్గు తేలుస్తా

పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELUGU DAILY
తెలుగు దినపత్రిక

# సంపాదకీయం

## కొత్త పాఠం..

చిన్నప్పుడు మన పాఠశాలల్లో మనల్ని వారానికో, మాసానికో ఒకసారి ఏదో ఒక అంశంపై స్వంతంగా వ్యాసం రాయమనేవాళ్ళు. కిందా మీదా పడి ఎక్కడెక్కడ నుంచో సమాచారం సేకరించుకొని రాసేవాళ్ళం. అందులో ఏవేవో ఆలోచనల్ని చొప్పించే వాళ్ళం. అందంగా రాయడానికి కుస్తీ పట్టేవాళ్ళం. మనకంటూ ఏదో ఒక ప్రత్యేకత వుండాలని తాపత్రయం పడేవాళ్ళం. ఇందులో కాపీలు ఉండేవి కావు. ఒకరి మీద ఆధారపడ్డం అసలే వుండేది కాదు. డౌన్లోడ్ చేసుకోడానికి తావే లేదు. అంతా సొంత ప్రయత్నం. ఏ శుక్రవారమో వక్తృత్వ పోటీలు పెట్టేవారు ఒక్కోసారయితే అప్పటికప్పుడు ఏ విషయం మాట్లాడాలో చెప్పేవారు. ఎలా మొదలు పెట్టాలి? ఎలా ముగించాలి? అనేదానిపై తర్జనబర్జన పడేవాళ్ళం బెరుగ్గా ఉండేది. అయినా సవాలుగా స్వీకరించేవాళ్ళం. అప్పటికి తోచింది గడగడా చెప్పేవాళ్ళం. చప్పట్లు కొట్టించుకొనే వాళ్లం. అప్పుడు మనకు చాట్ పిజిటి లేదు, గూగుల్ శోధన లేదు. వారాంతాల్లో ఏదో ఒక పుస్తకం నవలో నాటకమో చదవమనేవాళ్లు. పుస్తకాలు ఇంటి కిచ్చేవాళ్ళు చదివే రమ్మనే వాళ్ళు ఎలాగో ఒకలాగున వాటితో కుస్తీ పట్టేవాళ్ళం. తిరగేసి మరగేసి చదివే వాళ్ళం. ఏవేవో ఆలోచనలు కొత్త కొత్తవి ముసురుకునేవి. ఎక్కడెక్కడికో వెళ్లే వాళ్ళం. చదివిన దాని గురించి క్లాసులో చెప్పమనేవాళ్లు ముందు బెరుగ్గా అనిపించినా ఇష్టం వచ్చింది చెప్పేవాళ్ళం. ఇతర పిల్లలు చెప్పే దానితో పోల్చుకొనే వాళ్లం, నేర్చుకొనే వాళ్లం. అప్పుడు మనకు కృత్రిమ మేధ తోడుండేది కాదు. చదువుకొనే రోజుల్లో ఇవన్నీ మనల్ని ఊహాలోకంలో విహరింపజేసేవి. ఆలోచన తరంగాల్లో ఓలలాడించేవి. భాషా క్రీడలకు పురమాయించేవి. పఠన సామర్థ్యాన్ని, తార్కికతను నసలెత్తించేవి. తెలియని భరోసానిచ్చేవి. ఒక క్రమంలో ఇవన్నీ మనల్ని మనంగా తీర్చిదిద్దేవి. ఇందులో స్వప్రయత్నం వుంది. మనకు మనం మెదడుకు పదును పెట్టుకోవడం వుంది. ఒక్క మాటలో చెప్పాలంటే మానవ సహజాతం ఇందులో ఇమిడి ఉంది. ఒక క్రమానుగత వికాసం వుంది. అన్నిటికీ మించి మొగ్గలు తొడిగే సృజనాత్మకత వుంది. ముందు తరం కంటె తర్వాతి తరపు మానవ సంతతి తన తెలివితేటలు, సామర్థ్యాలు పెంచుకుంటూ పోతోందంటే దాని రహస్యం ఇక్కడే ఉంది. మానవ జాతిని మహోన్నత తీరాలకు చేర్చిన వారసత్వం. ఇప్పుడిదంతా కృత్రిమ మేధతో తారుమారయ్యేలా కనిపిస్తోంది. మన పిల్లలు ఏ ప్రశ్నకైనా, ఏ ప్రాజెక్టుకైనా, ఏ సమాచారానికైనా గూగుల్‌నో, చాట్ పిజిటినో, మరొక దాన్నో ఆశ్రయిస్తున్నారు. ఆగమేఘాల మీద ఏదో ఒక తక్షణ సమాచారం, సహకారం వాటి నుంచి లభిస్తోంది. ఏ విచక్షణా, స్వీయ ప్రయత్నం లేకుండా దాన్ని వాడేస్తున్నారు. ఇందులో తమదంటూ బుర్ర ఏమీ వుండడం లేదు. ఈ ధోరణి ఎంత దూరం వెళ్లిందంటే డెన్మార్క్ లాంటి దేశాలు ఫోన్లను, టాబ్ లను, ఇతర డిజిటల్ పరికరాలను చదువుల్లో పిల్లలు వాడరాదని నిషేధం పెట్టాయి. పాత పద్ధతికి మళ్ళీ వెళ్ళిపోతున్నాయి. ఇది ఇక్కడితో ఆగడం లేదు. మన పరిశోధన రంగానికి కూడా పాకి దాన్ని సైతం భ్రష్టు పట్టిస్తోంది. గత రెండేళ్లుగా ఇబ్బడి ముబ్బడిగా పరిశోధనా పత్రాలు వెలువడ్డానికి కారణం మన అన్వేషణలు పెరగడం కాదు, కృత్రిమ మేధ అందిస్తున్న రెడీమేడ్ సమాచారం మాత్రమేనంటున్నారు తప్పుడు పద్ధతులు, ఎక్కడెక్కడి చెత్తా పరిశోధనగా మారడం ఈ రోజుల్లో సాధారణం అయిపోయాయనీ, చివరికి ఇది మన మేధా సంపత్తి మీదా, నిజాయితీగా కష్టించి చేసే అన్వేషణల మీదా తీవ్ర ప్రభావం కలిగిస్తున్నాయనీ ఆందోళన మొదలైంది. గల్‌గోటియా విశ్వవిద్యాలయం వారి చైనా కృత్రిమ కుక్క ఎలా మన పరువు తీసిందో చూచాం. క్రమంగా మన విద్యాసంస్థలు కూడా దీనికి తగినట్టే మారిపోతున్నాయి. స్వీయ పఠనం, రచన, ఆలోచన, వ్యక్తీకరణలకు మన చదువుల్లో కాలం చెల్లుతోంది. కార్పొరేట్ నైపుణ్యాలు అందించడమే మన గొప్ప గొప్ప విశ్వవిద్యాలయాలకు సైతం పరమావధిగా మారుతోంది. దీంతో భాషలకు, సామాజిక శాస్త్రాలకు తావు లేకుండా పోతోంది. సర్వం స్టెమ్ (ఎస్.టి.ఇ.ఎమ్) మయమవుతోంది. భాషను పోగొట్టుకున్న విద్యావంతులు ఏమవుతారు? సామాజిక శాస్త్రాలు చదవని పిల్లల మానసిక స్థితి ఎలా వుంటుంది? ఊహలు, కలలు, భావోద్వేగాలు లేని జీవితం సారహీనంగా మారదా? మనిషిని మనిషి గాకుండా చేసి డొల్లగా మార్చదా? చివరికి మనిషి యంత్రంగా మారిపోడా? ఆఖరికిది హోమోసేపియన్ల అంతానికి దారి తీసినా ఆశ్చర్యం వుండదు గదా! మన దగ్గర ఎంత సాంకేతిక పరిజ్ఞానం ఎన్ని సులభ పద్ధతులు, ఏ వేగం వున్నాయని కాదు. ఇవన్నీ ఎంత మానవ కేంద్రంగా ఉన్నాయన్నది ముఖ్యం. మనిషికి ఎంత గౌరవం, ఎంత సామర్థ్యం, ఎంత విచక్షణ అందిస్తాయన్నది కీలకం. అంతిమంగా ఇవి మనల్ని సమానత్వం, సామాజిక న్యాయాల వైపు నడిపిస్తాయా మరిన్ని గోడలు నిర్మిస్తాయా అన్నది అసలు విషయం. మనలాంటి ఇప్పుడే ఎదుగుతున్న దేశాల్లో ఈ సమస్యలు మరింత క్లిష్టంగా వుంటాయి. మన సమాజమే ఎగుడుదిగుడు సమాజం మనవి అరకొర చదువులు. మిడిమిడి జ్ఞానపు మధ్య తరగతి మంచీచెడుల్ని వింగడిస్తున్న కాలం మనది. ప్రైవేటు రంగం ఏ అదుపూ బాధ్యతా లేకుండా సకల రంగాల్లోకి అల్లుకుపోయిన దేశం మనది. ఇప్పటికే మన దేశంలో 80 కోట్ల వైఫై కనెక్షన్లున్నాయి. దాదాపు పది కోట్ల మంది నిత్యం చాట్ పిజిటి వాడే వాళ్ళున్నారు. అయినా ఈ రంగంలో మనవి ఇంకా ఓనమాలే! రాబోయే రెండేళ్లలో కృత్రిమ మేధ విశ్వరూపాన్ని మనం చూడబోతున్నాం.

## 'వందేమాతరం' పాడటం తప్పనిసరి కాదు: సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** ప్రభుత్వ, అధికారిక కార్యక్రమాల్లో జాతీయ గేయం 'వందేమాతరం' పాడాలంటూ కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన సర్క్యులర్‌ను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను విచారించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఆ సర్క్యులర్ కేవలం సలహా పూర్వకమైనదే తప్ప, తప్పనిసరి కాదని స్పష్టం చేసింది. అందులో ఎలాంటి శిక్షార్హమైన చర్యలు పేర్కొననందున, ఈ పిటిషన్‌పై విచారణ తొందరపాటు అవుతుందని అభిప్రాయపడింది. భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ విపుల్ ఎం. పంచోలిలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ జరిపింది. ఈ ఏడాది జనవరి 28న కేంద్రం జారీ చేసిన నోటిఫికేషన్ కేవలం సలహా మాత్రమేనని, దాన్ని పాటించకపోతే శిక్షలు ఉంటాయని ఎక్కడా చెప్పలేదని ధర్మాసనం పేర్కొంది. "ఒకవేళ శిక్షార్హమైన చర్యలు తీసుకుంటే లేదా దీన్ని తప్పనిసరి చేస్తే అప్పుడు విచారిస్తాం. ప్రస్తుతానికి ఇందులో అలాంటివేమీ లేవు" అని కోర్టు వ్యాఖ్యానించింది. పిటిషనర్ తరఫున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది సంజయ్ హెగ్డే, సర్క్యులర్‌లో శిక్షలు లేకపోయినా ఇది పరోక్ష ఒత్తిడికి దారితీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. వందేమాతరం పాడటానికి లేదా గౌరవ సూచకంగా నిలబడటానికి నిరాకరించే వారు సామాజిక వివక్షను ఎదుర్కొనే ప్రమాదం ఉందని ఆయన వాదించారు. "దేశభక్తిని బలవంతంగా రుద్దలేరు. వ్యక్తిగత అంతరాత్మను కాపాడాల్సిన బాధ్యత రాజ్యాంగంపై ఉంది" అని ఆయన నివేదించారు. అయితే, పిటిషనర్ వ్యక్తం చేస్తున్న ఆందోళనలు ప్రస్తుతానికి ఊహాజనితమేనని ధర్మాసనం అభిప్రాయపడింది. ఒకవేళ ఎవరిపైనైనా శిక్షార్హమైన చర్యలు తీసుకున్నా లేదా వివక్ష చూపినా, అప్పుడు మళ్లీ కోర్టును ఆశ్రయించవచ్చని సూచిస్తూ పిటిషన్‌ను కొట్టివేసింది. విద్యాసంస్థలు, బహిరంగ సభల్లో వందేమాతరం పాడాలని కేంద్రం సర్క్యులర్‌లో సూచించింది. ఇది కేవలం జాతీయ గేయంపై గౌరవాన్ని పెంపొందించడానికేనని, చట్టబద్ధంగా అమలు చేయాలనే ఉద్దేశం లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. వందేమాతరం స్ఫూర్తి గురించి ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ లోక్‌సభలో ప్రస్తావించడం గమనార్హం. బంకించంద్ర చటోపాధ్యాయ 1875లో రచించిన ఈ గేయం, స్వాతంత్ర్య పోరాటంలో ప్రజలను ఏకతాటిపై నడిపించిందని కొనియాడారు. రవీంద్రనాథ్ ఠాగూర్ స్వరపరిచిన ఈ గీతాన్ని 1896లో కాంగ్రెస్ సమావేశంలో తొలిసారి ఆలపించారు. 1950లో అప్పటి రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్ దీనికి జాతీయ గేయం హోదా కల్పించారు.

## రూ. 47 లక్షల జేసీబీని ప్రారంభించిన సుభాష్



**కోనసీమ, పతాకం న్యూస్:** పట్టణంలోమున్సిపాల్ కార్యాలయం రూ. 47 లక్షలతో కొనుగోలు చేసిన నూతన జెసిబి వాహనాన్ని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ బుధవారంప్రారంభించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో ఆక్రమణల తొలగింపు, డ్రైనేజ్ శుభ్రపరిచే పనులు, ఇతర శానిటేషన్ పనులకు ఈ జెసిబి ఎంతోఉపయోగపడుతుందని తెలిపారు. నియోజకవర్గంలో ఇప్పటివరకు సుమారు రూ. 250 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని, రానున్న పుష్కరాల కు మరో రూ. 120 కోట్లు మంజూరు అవుతాయని వెల్లడించారు. మున్సిపల్న్ కార్యాలయం సాధారణ నిధులు , 15వ ఆర్థిక సంఘం నిధులతో జెసిబి కొనుగోలు చేసినట్లు మున్సిపాలిటీ డీఈ శ్రీకాంత్ మంత్రికి వివరించారు. ఇంతకు ముందు జెసిబి లేక అద్దె ప్రాతిపదికన తెచ్చుకునేవాళ్లమని, ఇప్పుడు మున్సిపాలిటీకి సొంతంగా జెసిబి ఉండటం వల్ల ఖర్చులు తగ్గి మున్సిపాలిటీ నిధులకు ఆదా కలుగుతుందని వివరించారు. ప్రజల సౌకర్యార్థం పట్టణ అభివృద్ధి పనులకు ఈ జెసిబి ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి తండ్రి వాసంశెట్టి సత్యం,జనసేన ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, టిడిపి అధ్యక్షులు ఉండవల్లి శివ, చందమామ వాసు, గరికపాటి సూర్యనారాయణ, ఎస్ కే పి పి ట్రస్ట్ చైర్మన్ సలాది నాయుడు, కడియాల రాఘవన్, కవల నానాజీ, కంచుమర్తి బాబురావు, దంగేటి గౌరీ శంకర్, మేడిశెట్టి సూర్యనారాయణ, దిగుమర్తి వీరబాబు, జాస్తివిజయలక్ష్మి, కేతా సుజాత, దోమ్మలపాటి విజయలక్ష్మి, మున్సిపల్ ఏఈలు పాల్గొన్నారు.

## 40 ఏళ్ల అనుబంధానికి స్వస్తి..కాంగ్రెస్‌కు జీవన్‌రెడ్డి రాజీనామా



**హైదరాబాద్, పతాకం న్యూస్:** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. జగిత్యాలలో కార్యకర్తల సమక్షంలో తన రాజీనామా లేఖను విడుదల చేసిన ఆయన, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పార్టీ హైకమాండ్ తీరుపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. గత 20 నెలలుగా పార్టీలో తీవ్రమైన మానసిక క్షోభకు గురవుతున్నానని, గౌరవం లేని చోట ఉండలేకే రాజీనామా నిర్ణయం తీసుకున్నానని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ విధానాలకు విరుద్ధంగా తెలంగాణలో ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యంగా జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను పార్టీలోకి తీసుకోవడం, ఆయనకు ప్రాధాన్యత ఇవ్వడంపై జీవన్ రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పదేళ్ల పాటు కష్టపడి పార్టీని అధికారంలోకి తెచ్చిన అసలైన కార్యకర్తలను పక్కన పెట్టి, ఇన్నాళ్లూ తమను ఇబ్బంది పెట్టిన వారికే పెద్దపీట వేస్తున్నారని ధ్వజమెత్తారు. తన వెన్నంటి ఉన్న కీలక నాయకుడు చనిపోతే సీఎం కనీసం పరామర్శించలేదని, రేవంత్ రెడ్డి తనకు అండగా నిలబడలేదని ఆరోపించారు. ఇకపై రేవంత్ రెడ్డి విధానాలపైనే తన పోరాటం ఉంటుందని ప్రకటించారు. మరోవైపు, జీవన్ రెడ్డిని బుజ్జగించేందుకు మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, టీపీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ చివరి వరకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు.

### ధూళిపాళ్ల కుమార్తె వివాహానికి

## హాజరైన చంద్రబాబు, రేవంత్‌రెడ్డి





**గుంటూరు, పతాకం న్యూస్:** తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ కుమార్తె వివాహ వేడుక గుంటూరులో వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. గుంటూరులోని శ్రీ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ఈ పెళ్లి వేడుకలో పాల్గొన్న సీఎం చంద్రబాబు.. వధూవరులు నాగసాయి వైదీప్తి, కెవిన్ రామ్‌లకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. వారి వైవాహిక జీవితం ఆనందంగా సాగాలని ఆకాంక్షించారు. ఈ వివాహ వేడుకకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా హాజరుకావడం విశేషం. ఇదే వేదికపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ కలిసి సందడి చేశారు. ఇద్దరు నేతలు ఒకే వేదికపై కనిపించడంతో కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణ నెలకొంది. ఈ పెళ్లి వేడుక పలువురు రాజకీయ ప్రముఖుల కలయికకు వేదికగా నిలిచింది.

## సెక్రటేరియట్ అధికారులకు ఐకానిక్ టవర్లు: నారాయణ



**అమరావతి, పతాకం న్యూస్:** అమరావతిలో రాష్ట్ర స్థాయి అధికారులంతా ఒకేచోట ఉండేలా సెక్రటేరియట్ కు ఐకానిక్ టవర్లను డిజైన్ చేశామని మున్సిపల్ మంత్రి నారాయణ తెలిపారు. అమరావతి రాజధానిలో నిర్మిస్తున్న ప్రధాన శాఖల టవర్ -3 కార్నర్ నోడ్ అమర్చే పనులకి మంత్రి పి నారాయణ బుధవారం పూజ నిర్వహించి, పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ ఐదు టవర్ల నిర్మాణం వేగవంతంగా జరుగుతుందన్నారు. అత్యాధునిక డయాగ్రిడ్ టెక్నాలజీతో నిర్మాణం జరుగుతుందన్నారు. గత ఏడాది వర్షాలు ఎక్కువగా రావడంతో 4 నెలల పాటు పనులకు ఆటంకం కలిగిందన్నారు. ఐకానిక్ భవనాలు, ప్రజాప్రతినిధులు,అధికారుల నివాసాలు, మౌళిక వసతుల పనులు వేగంగా జరుగుతున్నాయనీ తెలిపారు. అమరావతి నిర్మాణానికి సీఎం ప్రత్యేక ఫైనాన్స్ మోడల్ ఇచ్చారన్నారు. ప్రజలు కట్టే పన్నుల నుంచి ఒక్క రూపాయి కూడా అమరావతికి ఖర్చు పెట్టడం లేదన్నారు. అమరావతి సెల్ఫ్ ఫైనాన్స్ సిటీ అని తెలిపారు.

(మొదటిపేజీ తరువాయి)

## 28న అసెంబ్లీ ప్రత్యేక సమావేశం

ఆంధ్రప్రదేశ్ నూతన రాజధానిగా అమరావతిని ప్రకటిస్తూ విభజన చట్టంలో సవరణ చేస్తారు. పార్ట్ 2-5(2) సబ్‌సెక్షన్‌లో ఆంధ్రప్రదేశ్‌కు నూతన రాజధాని ఏర్పాటవుతుంది అనేచోట అమరావతి కేంద్రంగా ఆంధ్రప్రదేశ్‌కి నూతన రాజధాని ఏర్పాటైందని పేర్కొంటారు. ఇప్పటికే రాజధాని అమరావతి పనులు అత్యంత వేగంగా జరుగుతున్న సంగతి తెలిసిందే. దేశ విదేశాల నుంచి పెట్టుబడిదారులు వచ్చి ఇక్కడ తమ సంస్థల నిర్వహణకు ఎంఓయూలు చేసుకున్న సంగతి తెలిసిందే. డేటా సెంటర్? సహా ఎన్నో కంపెనీలు నెలకొననున్నాయి. ఇదిలా ఉండగా మరోవైపు రాజధాని అమరావతి నగర విస్తరణలో భాగంగా రెండోవిడత భూసమీకరణకు యంత్రాంగం పకడ్బందీ కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తోంది. తుళ్లూరు మండలంలో 3 గ్రామాలు, పల్నాడు జిల్లా అమరావతి మండలంలో 4 గ్రామాల పరిధిలో రైతుల నుంచి భూమి సమీకరించనున్నారు. ఇప్పటికే గ్రామసభలు నిర్వహించి మెజారిటీ రైతుల అభిప్రాయాలు సేకరించగా అత్యధికులు సానుకూలంగా స్పందించారు. తొలివిడత భూసమీకరణలో ఎదురైన ఇబ్బందులు పునరావృతం కాకుండా అధికారులు రెండో విడతలో జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అమరావతికి చట్టబద్ధత కల్పించే విషయంలో కేంద్ర కేబినెట్ తీర్మానానికి రంగం సిద్ధమైంది. ఈ క్రమంలో చట్టపరమైన ఇబ్బందులు తలెత్తకుండా కేంద్రం ముందు జాగ్రత్తలు తీసుకుంటోంది. తాజాగా సీఆర్డీఏ-2014 తీర్మానాన్ని సవరించాలని ఏపీకి సూచించింది. పీఎంవో సూచన మేరకు అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం తీర్మానం చేయనుంది. అందులో భాగంగా ఈ నెల 28న శాసనసభలో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు.

# బస్సు సౌకర్యం, సెల్ టవర్ కల్పించాలని గిరిజనుల వేడుకోలు



**రావికమతం, పతాకం న్యూస్:** అనకాపల్లి జిల్లా రావికమతం మండలం, జు కొత్తాపెల్లి గిరిజనులకు తారు రోడ్డు వచ్చింది. అయితే బస్ సౌకర్యం కల్పించాలని, సెల్ టవర్ ఏర్పాటు చేయాలని 7 గ్రామాల గిరిజనులు కోరారు. బుధవారం వారు మాట్లాడుతూ వివరాలను తెలిపారు. చిన్న పాసిలి నుండి అర్జాపురం బిఎన్ రోడ్డు వరకు 13 కిలోమీటర్లు తారు రోడ్డు నిర్మాణం చేయడం జరిగింది. 2023 సంవత్సరంలో రోడ్డుకి శంకుస్థాపన చేశారు. రోడ్డుతో వేసి వదిలేశారు. గిరిజన సంఘం అనేక ఆందోళన చేయడం ఫలితంగా రోడ్డు నిర్మాణం పూర్తయింది. విశాఖపట్నం నుండి వయా చిన్న పాసలి మీదుగా పాత కొత్తాపెల్లి బస్ సౌకర్యం కల్పించాలని, సెల్ టవర్ ఏర్పాటు చేయాలని, రేషన్ బియ్యం, అంగన్వాడి పిల్లలు ఫేస్ యాప్, రాంజీ ఎనర్జీ ఎస్ పథకాలు అమలు కావాలంటే సెల్ సిగల్ తప్పనిసరి అవసరము అని గిరిజనులు తెలిపారు. తక్షణమే సెల్ టవర్ ఏర్పాటు చేయాలని, విశాఖపట్నం వైద్యం కోసం వెళ్లాలంటే.... ఒకరోజు ముందుగా బయలుదేరవలసి వస్తుందని చెప్పారు. తమ పిల్లలు కాలేజీ చదువుకు వెళ్లాలంటే ప్రత్యేక ఆటో కట్టుకొని వేల రూపాయలు ఖర్చులు అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మండల కేంద్రానికి, పంచాయతీ కేంద్రానికి సచివాలయానికి వెళ్లాలంటే అనేక ఇబ్బందులకు గురవుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో పాడి బెన్నయ్య. పాడి గౌరీ. సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కే గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

# శాశ్వత ప్రాతిపదికన ప్రత్యేక రైళ్లు



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** తిరుపతి, బెంగళూరు, చర్లపల్లి ప్రత్యేక రైళ్లు ఇకపై శాశ్వత ప్రాతిపదికన వీక్లీ ఎక్స్‌ప్రెస్‌లుగా నడవనున్నాయి. విశాఖ–తిరుపతి–విశాఖ (18505/18506) ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ ఒకటి నుంచి, విశాఖ–చర్లపల్లి–విశాఖ (18527/18528) సర్వీసులు ఏప్రిల్ 3 నుంచి, విశాఖ–బెంగళూరు–విశాఖ ఎక్స్‌ప్రెస్ రైళ్లు (18509/18510) ఏప్రిల్ 5 నుంచి అందుబాటులోకి రానున్నాయి.విశాఖ–తిరుపతి (18505) రైలు ఏప్రిల్ 1 నుంచి ప్రతి బుధవారం రాత్రి 7 గంటలకు విశాఖలో బయలుదేరి 7.35 గంటలకు మరుసటిరోజు ఉదయం 9.30 గంటలకు తిరుపతి చేరుతుంది. తిరుగు ప్రయాణంలో ఏప్రిల్ 2 నుంచి ప్రతి గురువారం రాత్రి 9.50 గంటలకు తిరుపతి (18506)లో బయలుదేరి మరుసటిరోజు మధ్యాహ్నం 1.30 గంటకు విశాఖ చేరుతుంది. విశాఖ–బెంగళూరు (18509) రైలు ఏప్రిల్ 5 నుంచి ప్రతి ఆదివారం మధ్యాహ్నం 3.20 గంటలకు విశాఖలో బయలుదేరి మరుసటిరోజు మధ్యాహ్నం 1.50 గంటలకు బెంగళూరు చేరుతుంది. తిరుగు ప్రయాణంలో ఏప్రిల్ 6 నుంచి ప్రతి సోమవారం మధ్యాహ్నం 3.50 గంటలకు బెంగళూరు (18510)లో బయలుదేరి మరుసటిరోజు మధ్యాహ్నం 1.30 గంటలకు విశాఖ చేరుతుంది. విశాఖ–చర్లపల్లి (18527) రైలు ఏప్రిల్ 3 నుంచి ప్రతి శుక్రవారం సాయంత్రం 5.30 గంటలకు విశాఖలో బయలుదేరి మరుసటిరోజు ఉదయం 8 గంటలకు చర్లపల్లి చేరుతుంది. తిరుగు ప్రయాణంలో (18528) ఏప్రిల్ 4 నుంచి ప్రతి శనివారం మధ్యాహ్నం 2.30 గంటలకు చర్లపల్లిలో బయలుదేరి మరుసటిరోజు ఉదయం 5.20 గంటలకు విశాఖ చేరుతుంది.

# గంజాయి రహిత జిల్లాయే లక్ష్యం



**పాడేరు, పతాకం న్యూస్:** గంజాయిని శాశ్వతంగా నిర్మూలించి, జిల్లాను గంజాయి రహితం చేయాలని అధికారులను కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో గంజాయి నిర్మూలనపై జిల్లా ఎస్పీ అమిత్‌బర్దార్‌తో కలిసి వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో గంజాయి ప్రభావం ఉన్న ప్రాంతాలపై అధికారులకు సమగ్ర సమాచారం ఉండాలని, జిల్లాలో గంజాయి సాగు చేసేందుకు అవకాశం లేకుండా చూడాలన్నారు. గంజాయి సాగు, వినియోగం వల్ల కలిగే నష్టాలపై ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. అందుకు అవసరమైన అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. గిరిజనుల్ని గంజాయి సాగు నుంచి విముక్తి చేసి, వారిని ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రోత్సహించాలన్నారు. ముఖ్యంగా అధిక ఆదాయం వచ్చే ఉద్యాన పంటలను ప్రోత్సహించాలన్నారు. అలాగే డిగ్రీ, జూనియర్ కాలేజీల్లో, ఇతర విద్యాలయాల్లోనూ గంజాయి వల్ల కలిగే నష్టాలపై ప్రణాళికాబద్ధంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, యువతకు భాగస్వామ్యం కల్పించాలన్నారు. గంజాయికి బానిసలైన వారిని గుర్తించి వ్యసన విమోచన కేంద్రాల్లో చేర్పించి, అవసరమైన సేవలు అందించాలని ఆదేశించారు. గంజాయి సాగును వీడిన గిరిజన రైతులకు స్వయం ఉపాధి కల్పన పథకాలు, బ్యాంకు రుణాలు మంజూరు చేయాలని, వాళ్లు సమాజంలో గౌరవప్రదంగా జీవనం సాగించేలా చూడాలన్నారు. గంజాయి సాగు, రవాణా చేస్తున్న వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేయాలని పోలీసు అధికారులను కలెక్టర్ ఆదేశించారు. యువతకు అవసరమైన వృత్తి నైపుణ్య శిక్షణలు అందించాలని ఆయన సూచించారు. ఎస్పీ అమిత్‌బర్దార్ మాట్లాడుతూ గంజాయి సాగు, రవాణా అరికట్టేందుకు పటిష్ట చర్యలు చేపడుతున్నామన్నారు. గంజాయి వ్యవహారాల్లో సంబంధాలున్న వారి బంధువులపైనా తాము నిఘా పెట్టామన్నారు. గంజాయి ద్వారా సంపాదించిన ఆస్తులను జప్తు చేయడం వంటి చర్యలు చేపడుతున్నామని, గంజాయి స్మగ్లర్లకు, అపరిచిత వ్యక్తులకు గ్రామాల్లో ఆశ్రయం కల్పించవద్దని ప్రజలకు సూచిస్తున్నామని చెప్పారు. గంజాయి రవాణాను అరికట్టేందుకు చెక్‌పోస్టులు, తనిఖీలు, ప్రతి చోటా పటిష్ఠ నిఘా పెట్టామన్నారు. ప్రజలు గంజాయి సంబంధ చట్టవ్యతిరేక వ్యవహారాలకు దూరంగా ఉండాలని ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పి.అంబేద్కర్, జిల్లా ఉద్యానవనాధికారి కె.బాలకర్ణ, జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బీఎస్.నందు, జిల్లా గ్రామీణాభివృద్ధికి సంస్థ పీడీ వి.మురళి, జిల్లా విద్యాశాఖాధికారి రామకృష్ణారావు, ఐసీడీఎస్ పీడీ ఝాన్సీబాయి, గిరిజన సంక్షేమ శాఖ డీడీ పీబీకే పరిమిళ, ఎల్‌డీఎం మాతునాయుడు, ఈగల్, అటవీ, వెలుగు శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రోజురోజుకూ పెరుగుతున్న గ్యాస్ కష్టాలు



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** వంట గ్యాస్ సమస్య రోజురోజుకూ జిల్లాలో పెరుగుతోంది. ఇప్పటికే సిలిండర్ కోసం చాలామంది ఏజెన్సీలు చుట్టూ తిరుగు తున్నారు. గ్యాస్ ఇబ్బందులతో నగరంలో అనేక హోటళ్లు మూతపడుతున్నాయి. విద్యా సంస్థలకు చెందిన హాస్టల్స్‌పైనా వంట గ్యాస్ కొరత ప్రభావం పడింది. ఆంధ్ర మెడికల్ కళాశాల పరిధిలోని ఎంబీబీఎస్, పీజీ వసతి గృహాలను నాలుగు రోజుల నుంచి గ్యాస్ సమస్య వేధిస్తోంది. ఆశించిన స్థాయిలో గ్యాస్ సరఫరా లేకపోవడంతో నిర్వాహకులు కట్టెల పొయ్యిపై వంట చేస్తున్నారు. ఆంధ్ర మెడికల్ కళాశాలకు చెందిన రెండు మహిళా వసతి గృహాల్లో సుమారు 500 మంది ఎంబీబీఎస్ విద్యార్థినులు, మరో 50 మంది వరకు పీజీ విద్యార్థినులు ఉంటున్నారు. రెండు పురుషుల వసతి గృహాల్లో 464 మంది ఎంబీబీఎస్ విద్యార్థులు, 150 మంది పీజీ విద్యార్థులు ఉంటున్నారు. ఈ నాలుగు వసతి గృహాల్లో వంట అవసరాల కోసం ప్రతినెలా 270 వరకు సిలిండర్లు కావాల్సి ఉంటుంది. అయితే, నాలుగు రోజులు నుంచి గ్యాస్ సరఫరా ఆగిపోవడంతో పొదుపుగా వినియోగించడంపై అధికారులు దృష్టిసారించారు. కొన్ని రకాల వంటలను అంటే అన్నం, పప్పు, సాంబారు వంటి వాటిని కట్టెల పొయ్యిపై వండాలని సిబ్బందికి సూచించారు. వేపుళ్లు, కర్రీల వంటి వాటి కోసం మాత్రం గ్యాస్ వినియోగిస్తున్నారు. ఇండక్షన్ స్టవ్‌స్‌ను కూడా కొనుగోలు చేశామని, వంటలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని ఆంధ్ర మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ సంధ్యాదేవి తెలిపారు. సమస్యను డీఎంఈ దృష్టికి తీసుకువెళ్లామని, ఉన్నతాధికారులతో మాట్లాడి అవసరమైన సిలిండర్లు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చినట్టు వెల్లడించారు. జిల్లా కలెక్టర్ కూడా అవసరమైన సిలిండర్లు అందిస్తామని చెప్పినట్టు తెలిపారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

# అధ్వానంగా నందిగుడ చెరువు



**అరకులోయ, పతాకం న్యూస్:** మండలంలో వందలాది ఎకరాలకు సాగునీరందించే మాడగడ పంచాయతీ నందిగుడ చెరువు నిర్వహణ లేక అధ్వానంగా తయారైంది. వాస్తవానికి ఈ చెరువు నుంచి నందిగుడ, చంపగుడ, గత్తరగుడ, కాగువలస గ్రామాలకు చెందిన 228.84 ఎకరాలకు సాగునీరు అందాలి. అయితే చెరువు పూడుకుపోవడం, చెక్‌డ్యాం దెబ్బతిని నీరు వృథాగా పోతుండడంతో నీరు అందడం లేదని ఆయకట్టు రైతులు వాపోతున్నారు. నందిగుడ చెరువు చాలా వరకు పూడుకుపోయింది. చెరువు కింద ఉన్న చెక్‌డ్యాం, చెక్‌డ్యాం చానళ్లు దెబ్బతిన్నాయి. స్లూయిస్ గేట్లు మరమ్మతులకు గురయ్యాయి. వీటన్నింటినీ పూర్తి చేస్తే 228 ఎకరాలతో పాటు అదనంగా మరో 86 ఎకరాలకు నీరందించేందుకు అవకాశం ఉంటుంది. ఈ మేరకు తహశీల్దార్, ఆర్ఐ గత ఏడాది మే 8న సర్వే చేసి ఎస్ఎంఐ శాఖకు, కలెక్టర్, ఐటీడీఏ పీవోకు నివేదిక పంపారు. దీని ఆధారంగా పాడేరు ఎస్ఎంఐ ఈఈ సుమారు రూ.34 లక్షల వ్యయంతో పనులు చేపట్టేందుకు ఉన్నత అధికారులకు ప్రతిపాదనలు పంపించారు. దీంతో గత నెలలో ఐదు రోజులపాటు చెరువులో పూడికతీత పనులు చేపట్టారు. అనంతరం చెరువులో నీరు ఉందంటూ పనులు నిలిపివేశారు. కలెక్టర్, ఐటీడీఏ పీవో స్పందించి వర్షాకాలానికి ముందే పనులు పూర్తి చేసి సాగునీరు అందించాలని రైతులు కోరుతున్నారు.

# ఆర్టీసీ బస్సుల కొరతపై ఎస్ఎఫ్ఐ భారీ ర్యాలీ




**విశాఖపట్నం, పతాకం న్యూస్:** విశాఖపట్నం జిల్లాలో విద్యార్థులు, ప్రయాణికులు బస్సుల కొరత కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్న సమస్యపై ఎస్ఎఫ్ఐ (స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యంలో విద్యార్థులు భారీ స్థాయిలో బుధవారం ఆందోళన చేపట్టారు. గత మూడు నెలలుగా విద్యార్థుల నుండి పెద్ద ఎత్తున సంతకాల సేకరణ చేపట్టి జిల్లా కలెక్టర్, ఆర్టీసీ రీజనల్ మేనేజర్, రవాణా శాఖ మంత్రికి పలుమార్లు వినతిపత్రాలు అందజేసినప్పటికీ ఎలాంటి స్పందన లేకపోవడంతో ఎస్ఎఫ్ఐ పిలుపు మేరకు రీజనల్ మేనేజర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ గాంధీ విగ్రహం నుండి ప్రారంభమై ఆర్టీసీ రీజనల్ మేనేజర్ కార్యాలయం వరకు సాగింది. అనంతరం విద్యార్థులు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి. వెంకటరమణ మాట్లాడుతూ .... జిల్లాలో ఆర్టీసీ బస్సుల కొరత తీవ్రమైందని, దీని వల్ల విద్యార్థులు గంటల తరబడి బస్ స్టాప్‌లలో వేచి ఉండాల్సి వస్తోందని తెలిపారు. బస్సులు తగిన సంఖ్యలో లేకపోవడంతో విద్యార్థులు తరగతులకు సమయానికి చేరుకోలేక క్లాసులు మిస్ అవుతున్నారని, అలాగే ఇంటికి తిరిగి వెళ్లడంలో కూడా ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. అలాగే విశాఖ ప్రజలు బస్సుల కొరతతో ఇబ్బందులు పడుతుండగా సుమారు 30 ప్రభుత్వ బస్సులను గీతం ప్రైవేట్ యూనివర్సిటీకి కాంట్రాక్ట్ ఇవ్వడం అన్యాయమని పేర్కొంటూ ఆ కాంట్రాక్ట్‌ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షులు అజరు మాట్లాడుతూ .... ప్రభుత్వం పథకాలను అమలు చేయడంలో చూపుతున్న శ్రద్ధను ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో చూపడం లేదని విమర్శించారు. విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలి, ప్రత్యేక బస్సులు నడపాలి, నగరానికి తగిన విధంగా బస్సుల సంఖ్యను పెంచాలని, గీతం యూనివర్సిటీకి ఇచ్చిన కాంట్రాక్ట్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో జోన్ వారీగా బస్సులను అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో ధర్నా స్థలానికి వచ్చిన ఆర్టీసీ రీజనల్ మేనేజర్ అప్పలనాయుడు విద్యార్థుల డిమాండ్లపై స్పందిస్తూ జూలై 1వ తేదీ నుంచి విశాఖ జిల్లాకు అదనంగా 100 బస్సులు ఏర్పాటు చేస్తామని, గీతం యూనివర్సిటీ కాంట్రాక్ట్‌పై ఉన్నతాధికారులతో చర్చించి రద్దు చేసే చర్యలు తీసుకుంటామని, విద్యార్థులకు ప్రత్యేక బస్సులు కూడా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అధికారుల హామీతో విద్యార్థులు తమ ధర్నాను విరమించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు నిఖిల్, నరేష్, తులసి, ప్రగతి, భరత్, సూర్య, యూనివర్సిటీ ఉపాధ్యక్షులు తరుణ్, ఇతర విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉద్యాన రంగంతో ఉజ్వల భవిష్యత్




**గరుగుబిల్లి, పతాకం న్యూస్:** ఉద్యాన రంగంతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి తెలిపారు. ఉల్లిభద్ర డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన కళాశాలలో 12వ అంతర్ కళాశాల సాంస్కృతిక, సాహిత్య సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం ఏఐతో సాఫ్ట్‌వేర్ రంగాల్లో విప్లవాత్మక మార్పులు వచ్చినా ఉద్యాన రంగానికి సంబంధించి ఎటువంటి మార్పు రాలేదన్నారు. ఉపాధికి ఉద్యాన రంగం దోహదపడుతుందని తెలిపారు. ఉద్యాన రంగానికి ఉన్న ప్రాముఖ్యత, ఆవశ్యకత ఎప్పటికీ తగ్గదన్నారు. మొక్కలు పెంపకం, సంరక్షణ వంటి అంశాల్లో మానవ ప్రమేయం, విద్యార్థుల నైపుణ్యం ఎంతో కీలకమని తెలిపారు. విద్యార్థులు పూర్తిస్థాయిలో ప్రతిభను చాటుకోవాలన్నారు. ప్రతిష్మాత్మకంగా చేపడుతున్న ముస్తాబు కార్యక్రమంలో వైఎస్ఆర్ ఉద్యాన కళాశాల భాగస్వామ్యం కావాలని కలెక్టర్ సూచించారు. పీహెచ్‌సీలు, ఆసుపత్రుల్లో మొక్కలు నాటి ఆహ్లాదకరంగా మార్చుతున్నామని, వాటికి దీటుగా కళాశాలను తీర్చిదిద్దాలని సూచించారు. విద్యార్థులు చదువుకే పరిమితం కాకుండా సృజనాత్మకత కార్యక్రమాల్లో చొరవ చూపాలన్నారు. యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ కె.ధనుంజయరావు మాట్లాడుతూ.. ఉద్యాన రంగంలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు జాతీయ స్థాయికి చేరుకునేలా ప్రత్యేక చర్యలు చేపడు తున్నామని తెలిపారు. విద్యను అభ్యసించే వారు ప్రకృతికి అత్యంత సమీపంలో ఉండటం అదృష్టమన్నారు. ఉద్యాన రంగం మానసిక ప్రశాంతతను అందిస్తుందన్నారు. విశ్వ విద్యాలయం పరిధిలోని ఎనిమిది కళాశాలలకు చెందిన విద్యార్థుల ప్రదర్శనలు ఎంతగానో

# అక్రమ మట్టి తవ్వకాలను అడ్డుకున్న వైసీపీ నాయకులు



**కడియం, పతాకం న్యూస్:** రాజమండ్రి రూరల్ నియోజవర్గం కడియం మండలం పొట్టిలంక గ్రామంలో అక్రమంగా తరలిస్తున్న మట్టి లారీలను తూర్పు గోదావరి జిల్లా వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అడ్డుకున్నారు. పొట్టిలంక గ్రామ పంచాయతీ పరిధిలోని సర్వే నెంబర్ 147లో అక్రమంగా నది గర్భంలోని నల్లమట్టిని తవ్వుతూ నిబంధనలకు పాతర వేస్తూ తరలిస్తున్న మట్టి లారీలను, జేసీబీలను ఈరోజు స్థానిక మండల నాయకులతో కలిసి సంఘటనా ప్రాంతానికి వెళ్లి అడ్డుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. ఎన్జీటీ ప్రామాణికాల ప్రకారం నదీ తీర ప్రాంతాల్లో మట్టిని తవ్వకూడదని దాన్ని తరలించకూడదని నదీ తీర ప్రాంతాల్లో బాటలు వేసి వాహనాల ప్రయాణాలు చేయకూడదని నిబంధనలు ఉన్నా అవన్నీ తుంగలో తొక్కుతూ ఈరోజు కూటమి ప్రభుత్వం అన్యాయాలకు పాల్పడుతుందని, బ్యాంకుల్లో లోన్లు పొంది ఉన్న పొలాలను సైతం దొంగ పట్టాలు సృష్టించి, అధికారులపై ఒత్తిళ్లు చేసి అనుమతులు పొంది అక్రమంగా ప్రజాధనాన్ని దోచుకుంటున్నారని, మీటర్ తవ్వడానికి పర్మిషన్ తీసుకుని రెండు మీటర్ల పైచిలుకు మట్టిని దోచేశారని, తవ్విన మట్టిని 14 వేలకు పైగా బయట విచ్చలవిడిగా అమ్ముతున్నారని, వందల లారీల కొద్దీ మట్టిని పంట పొలాలను తవ్వి యథేచ్ఛగా తరలిస్తున్నారని, గతంలో ఏనాడూ లేని విధంగా లంక ప్రాంతాల్లో అక్రమాలకు పాల్పడుతూ ప్రజల సొమ్మును కొల్లగొడుతున్నారని తద్వారా వారి జేబులు నింపుకోవడానికి ఇలాంటి దుశ్చర్యకు పాల్పడుతున్నారని అన్నారు. అనేక పర్యయాలు నేను నీతిమంతుడిని అంటూ సీనియర్ శాసనసభ్యులు అయినటువంటి గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఎన్నోసార్లు ప్రకటించుకున్నారని, ఈరోజు మీ నియోజకవర్గ పరిధిలో మట్టి మాఫియా చెలరేగిపోయి నదీ తీర ప్రాంతాల్లో ఉన్నటువంటి మట్టిని దోచుకుంటుంటే మీరు చర్యలు చేపట్టకుండా ఇప్పటివరకు ఈ విషయంపై నోరు మెదపకుండా ఉండటం చాలా ఆశ్చర్యమని, ఈ మట్టి తవ్వకాల్లో వారి ప్రమేయం లేకపోతే వెంటనే మీరు ఈ ప్రాంతాన్ని పరిశీలించి అధికారులకు ఆదేశాలు జారీ చేసి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# దళితుల భూములను ఆక్రమిస్తే సహించేది లేదు



**గుమ్మలక్ష్మీపురం, పతాకం న్యూస్:** జియమ్మ వలస మండలం, చింతలబెలగాం గ్రామంలో దళితుల భూముల ఆక్రమణ మరియు స్మశాన వాటిక వివాదంపై రాష్ట్ర ఎస్సీ కమిషన్ సీరియస్ అయ్యింది. గత మూడు నెలలుగా విజయవాడలోని ఎస్సీ కమిషన్ ప్రధాన కార్యాలయానికి అందుతున్న ఫిర్యాదుల నేపథ్యంలో, కమిషన్ ప్రతినిధులు బుధవారం గ్రామంలో క్షేత్రస్థాయి విచారణ చేపట్టారు. చింతలబెలగాం గ్రామానికి చెందిన 9 మంది ఎస్సీ సామాజిక వర్గ బాధితులకు చెందిన సుమారు 12 ఎకరాల భూమిని ఇతర సామాజిక వర్గాల వారు అక్రమంగా ఆక్రమించుకున్నారని బాధితులు కమిషన్ దఅష్టికి తీసుకెళ్లారు. తమ భూములను ఎవరికీ అమ్మలేదని, లీజుకు కూడా ఇవ్వలేదని, కానీ రికార్డుల్లో పేర్లు ఎలా మారాయో అర్థం కావడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అదే గ్రామానికి చెందిన బెలగాం సాయమ్మ అనే మహిళ ఇటీవల మఅతి చెందగా, దళితులకు కేటాయించిన స్మశాన వాటికలో ఆమె మఅతదేహాన్ని ఖననం చేశారు. అయితే ఆ స్థలం తమదంటూ ఇతర సామాజిక వర్గాల వారు రాత్రికి రాత్రే శవాన్ని బయటకు తీసి వేరే చోట పడేయడంపై ఎస్సీ కమిషన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. ఇది అత్యంత దారుణమైన మరియు అమానవీయమైన చర్య అని కమిషన్ ప్రతినిధి పేర్కొన్నారు. గౌరవ ఎస్సీ కమిషన్ చైర్మన్ కె.హెచ్. విక్టర్ ప్రసాద్ గారి ఆదేశాల మేరకు అధికారులు ఎం.ఆర్.ఓ, సాంఘిక సంక్షేమ శాఖ మరియు పోలీస్ యంత్రాంగంతో కలిసి వివాదాస్పద భూములను పరిశీలించారు. ఈ అక్రమ భూ బదలాయింపులు, స్మశాన వాటిక ఘటనపై సమగ్ర నివేదికను ప్రభుత్వానికి సమర్పించనున్నారు. ఆర్.డి.ఓ దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లి, బాధితులకు తిరిగి వారి భూములు దక్కేలా చూస్తామని కమిషన్ భరోసా ఇచ్చింది. దళితుల భూములు వేరే వారికి మారడం చట్ట విరుద్ధం. బాధితులకు పూర్తిస్థాయిలో న్యాయం జరిగే వరకు ఎస్సీ కమిషన్ అండగా ఉంటుంది," అని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## వంట ఎలా చేస్తున్నారు? రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభమైన సర్వే



**అమరావతి, పతాకం న్యూస్:** రాష్ట్రంలో ప్రజలు వంటకు వినియోగిస్తున్న ఇంధనంపై ప్రభుత్వం దృష్టి సారించింది. 'వంట ఎలా చేస్తున్నారు?' అంటూ ప్రభుత్వ సిబ్బంది ఇళ్ల దగ్గరకు వచ్చి ఆరా తీయడం ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ ప్రక్రియ ప్రారంభమైంది. గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది ఈ వివరాలు సేకరిస్తున్నారు. 'ఎపి గ్యాస్ వినియోగదారుల సర్వే 2026' పేరుతో నిర్వహిస్తున్న ఈ ప్రక్రియ లక్ష్యాలను మాత్రం అధికారులు వెల్లడించడం లేదు. గ్యాస్, కిరోసిన్, కట్టెలు, గోబర్ గ్యాస్, పైపుడ్ న్యాచురల్, విద్యుత్‌లలో ఏ ఇంధనాన్ని వంట కోసం వాడుతున్నారన్న వివరాలను సిబ్బంది సేకరిస్తున్నారు. ఒకే ఇంధనం వాడుతున్నారా? రెండు, అంతకన్నా ఎక్కువ ఇంధనాలను వినియోగిస్తున్నారా అన్న అంశంపై కూడా ప్రభుత్వం దృష్టి సారించింది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఇంధన వినియోగంలో ఉన్న వ్యత్యాసాలకు సంబంధించిన వివరాలను కూడా అధికారులు సేకరిస్తున్నారు. ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధం నేపథ్యంలో ఈ సర్వే ప్రారంభించడం చర్చనీయాంశంగా మారింది. పైనుండి వచ్చిన ఆదేశాల మేరకు వివరాలు సేకరిస్తున్నట్లు దిగువ స్థాయి సిబ్బంది చెబుతుంటే, ఉన్నతస్థాయి అధికారులు మాత్రం పెదవి విప్పడం లేదు. అయితే, ప్రజానీకాన్ని పైప్డ్ నెట్ వర్క్ గ్యాస్ (పిఎన్‌జి) వైపు మళ్లించాలంటూ కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే రాష్ట్రాలకు దిశా నిర్ధేశం చేసిన నేపథ్యంలో సర్వే లక్ష్యం కూడా అదే అయిఉంటుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. తాజా సర్వేలో మొత్తం కుటుంబాలను కవర్ చేసేలా ప్రయత్నాలు చేస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి వంటకు వినియోగించే విధానాన్ని తెలుసుకోనున్నారు. అలాగే సర్వే సందర్భంగా లోపాయికారీ హెచ్చరికలు కూడా జారీ చేయాలని నిర్ణయించారు. సర్వేలో వివరాలు పూర్తిగా వెల్లడిస్తే భవిష్యత్తులో వివిధ అంశాల్లో లబ్దికి ఆస్కారం ఉంటుందని స్పష్టం చేస్తున్నారు. లేకుంటే ఇబ్బందులు తప్పవన్న సందేశాన్ని కూడా ఇస్తున్నట్లు సమాచారం.

## ఎల్‌పీజీ రీఫిల్ నిబంధనల్లో మార్పులు లేవు.. బుకింగ్‌పై వదంతులు నమ్మొద్దు: పెట్రోలియం శాఖ



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ రీఫిల్ బుకింగ్ గడువును మార్చారంటూ వస్తున్న వార్తలను కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. ఇవి పూర్తిగా నిరాధారమైన, తప్పుదోవ పట్టించే కథనాలని స్పష్టం చేసింది. ఎల్‌పీజీ కనెక్షన్లకు సంబంధించి రీఫిల్ బుకింగ్ నిబంధనల్లో ఎలాంటి మార్పులు చేయలేదని కేంద్ర పెట్రోలియం, సహజవాయువు మంత్రిత్వ శాఖ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. కొన్ని మీడియా సంస్థలు, సోషల్ మీడియాలో ప్రధాన్ మంత్రి ఉజ్వల యోజన (గ్రామీణ్) లబ్ధిదారులకు 45 రోజులు, ఇతరులకు 25 నుంచి 35 రోజుల గడువు విధించినట్టు ప్రచారం జరిగింది. ఈ వార్తల్లో ఏమాత్రం నిజం లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రస్తుతం అమల్లో ఉన్న నిబంధనల ప్రకారమే రీఫిల్ బుకింగ్ ప్రక్రియ కొనసాగుతుందని వివరించింది. పట్టణ ప్రాంతాల్లో 25 రోజుల తర్వాత, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజుల తర్వాత వినియోగదారులు మరో సిలిండర్‌ను బుక్ చేసుకోవచ్చు. ఇలాంటి తప్పుడు సమాచారాన్ని నమ్మవద్దని, అనవసరంగా ఆందోళనతో సిలిండర్లను బుక్ చేసుకోవద్దని ప్రజలకు ప్రభుత్వం సూచించింది. దేశవ్యాప్తంగా సరిపడా ఎల్‌పీజీ నిల్వలు ఉన్నాయని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చింది. దేశంలోని అన్ని రిఫైనరీలు పూర్తి సామర్థ్యంతో పనిచేస్తున్నాయని, పెట్రోల్, డీజిల్ నిల్వలు కూడా పుష్కలంగా ఉన్నాయని పేర్కొంది. ఇదే సమయంలో పెట్రోల్, డీజిల్ కొరత ఉందన్న వదంతులను భారత్ పెట్రోలియం కార్పొరేషన్ కూడా ఖండించింది. ఇరాన్ యుద్ధం కారణంగా ఆర్థిక వ్యవస్థపై పడే ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు చమురు, గ్యాస్, సరఫరా వ్యవస్థలపై దృష్టి సారించేందుకు కేంద్రం ఏడు ఉన్నతస్థాయి బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపింది.

## పీఆర్‌సీ చైర్మన్‌ను నియమించాలి




**పాలకొండ, పతాకం న్యూస్:** పీఆర్‌సీ చైర్మన్‌ను వెంటనే నియమించాలని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ నేతలు డిమాండ్ చేశారు. సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 29 శాతం ఐఆర్ వెంటనే ప్రకటించాలన్నారు. పెండింగ్ డీఏలు విడుదల చేయాలన్నారు. ఉద్యోగుల పెన్షనర్ల కాయిలు చెల్లింపులకు రూట్‌మ్యాప్ ప్రకటించాలన్నారు. సీపీఎస్ రద్దు చేయాలని, మెమో 57 ప్రకారం 2004కు ముందు నియామక ప్రక్రియ పూర్తయిన వారికి పాత పింఛనఖ అమలు చేయాలన్నారు. హెల్త్‌కార్డులు, మెడికల్ బిల్లుల సమస్యలు వెంటనే పరిష్కరించాలన్నారు. కోవిడ్ సమయంలో మరణించిన 953 పంచాయతీరాజ్ ఉద్యోగ, ఉపాధ్యాయుల కుటుంబాలకు కారుణ్య నియామకాలు కల్పించాలన్నారు. అనంతరం సబ్ కలెక్టర్ స్వప్నిల్ పవర్ జగన్నాథ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్య క్రమంలో ఆంధ్ర ఫెడరేషన్ నేతలు హారిక భాస్కరరావు, కుండంగి కృష్ణ, పైడిరాజు, పడాల కాంతారావు, నాగేశ్వరరావు, మహేశ్, ప్రమీల, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

## నివాస స్థలాల్లోనే ఇళ్లు నిర్మించి ఇవ్వాలి



**లక్కవరపుకోట, పతాకం న్యూస్:** మండలంలోని ఉత్తరాపల్లి గంగుపూడిలో పేదలు నివాసమున్నచోటే అధికారులు పట్టాలు మంజూరు చేసి ఇళ్లు కట్టించి ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ డిమాండ్ చేశారు. గ్రామంలో బాధితపేదలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ గంగుపూడి రెవెన్యూ పరిధిలో అప్పటి ప్రభుత్వం ఏర్పాటు చేసిన బిసి కాలనీఓల 50కుటుంబాల వారికి అప్పటిప్రభుత్వం నివాస స్థల పట్టాలు మంజూరు చేసిందని తెలిపారు. ఆ భూమిలో మరి కొంతమంది అర్హులైన 75కుటుంబాల వారు నేటికి సుమారు40నుంచి 50ఏళ్లగా కుటుంబాలతో జీవనం సాగిస్తున్నారని అన్నారు. వీరికి స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామపెద్దలు మాయమాటలు చెప్పి వేరే చోట ఇళ్ల స్థలాలు ఇస్తామని చెప్పి ఖాళీ చేయించారని, పదినెలలైనా ఇంతవరకు పట్టించుకోలేదని అన్నారు. దీంతో ఇళ్లులేక పేదలంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి పేదలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్‌కు వినతి అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు గాడి అప్పారావు, మద్దిల రమణ, రైతు సంఘంమ నాయకులు గొంప కృష్ణమూర్తి, సిఐటియు నాయకులు టి.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

## గొట్టా బ్యారేజీ దిగువకు నీరు విడుదల



**హిరమండలం, పతాకం న్యూస్:** వంశధార అధికారులు ఎట్టకేలకు గొట్టాబ్యారేజీ కిందకు నీటిని విడిచిపెట్టేశారు. బ్యారేజీ అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఎగువ ప్రాంతంలో నిల్వ ఉన్న నీటిని ఖాళీ చేయాల్సి ఉంది. ఇటీవల రెండుసార్లు గేట్లు ఎత్తి నీటిని విడిచిపెట్టిన సమయంలో రైతులు వచ్చి ఆందోళన చేపట్టడంతో అధికారులు ఆగిపోయారు. పనులు చేపట్టేందుకు సమయం మించిపోతుండడంతో మరోసారి వంశధార అధికారులు ఆరు గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడిచిపెట్టారు. ఈ విషయం తెలుసుకున్న ఎడమ కాలువ ఆయకట్టు రైతులు బ్యారేజీ వద్దకు చేరుకుని ఆందోళన చేపట్టేందుకు సిద్ధమయ్యారు. అప్పటికే హిరమండలం ఎస్‌ఐ హేమంత్ కళ్యాణ్ ఆధ్వర్యంలో పోలీసులు అక్కడకు చేరుకున్నారు. రైతులు ఎవరైనా అడ్డుకునేందుకు ప్రయత్నిస్తే కేసులు పెడతామని హెచ్చరించారు. దీంతో రైతులు ధర్నా చేపట్టేందుకు వెనక్కి తగ్గారు. ఎడమ కాలువ ద్వారా నీటి విడుదలను నిలిపివేయడంతో వరి, మొక్కజొన్న పంటలు పూర్తిగా నష్టపోవాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వారం రోజుల పాటు నీరందిస్తే పంట చేతికి వస్తుందని, ఇలాంటి సమయంలో నీటిని బ్యారేజీ దిగువకు వదిలేయడం అన్యాయమని అన్నారు. తమ గోడును నాయకులు, అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

## యువకుడి ఆత్మహత్య

**విజయనగరం, పతాకం న్యూస్:** విశాఖపట్నం సారా గ్రామ కాలనీకి చెందిన దువ్వాడ ప్రేమ్‌కుమార్(31) సాయంత్రం విజయ నగరం గోకపేట వద్ద చెట్టుకు ఉరి వేసుకున్నాడు. ఒకటో పట్టణ సీఐ చక్రవర్తి అందించిన వివరాల ప్రకారం.. ప్రేమ్‌కుమార్ ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నాడు. పెళ్లయినా పిల్లలు లేరు. మద్యానికి బానిస కావడంతో పాటు ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడుతున్నాడు. ఉదయం 11 గంటల సమయంలో ఇంటి వద్ద ద్విచక్ర వాహనంపై బయలుదేరి.. విజయనగరం వచ్చాడు. రోడ్డు పక్కన ద్విచక్ర వాహనం పెట్టి చెట్టుకు ఉరివేసుకున్నాడు. మృతుడి జేబులోనున్న సెల్‌ఫోన్ ఆధారంగా పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి తండ్రి శ్రీనివాసరావు వచ్చి తన కుమారుడని గుర్తించారు. శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

## ఏప్రిల్ 28న సచివాలయం ముట్టడి



**చీపురుపల్లి, పతాకం న్యూస్:** ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించకపోతే ఏప్రిల్ 28న అమరావతిలో సెక్రటేరియట్‌ను ముట్టడిస్తామని యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెయస్‌యస్ ప్రసాద్ హెచ్చరించారు. పిఆర్‌సి కమిటీని ఏర్పాటు చేయాలని, 29శాతం ఐఆర్ ప్రకటించాలని, గత పిఆర్‌సి, డిఏ బకాయిల చెల్లింపునకు రూట్ మ్యాప్ ప్రకటించాలని, మెమో 57 అమలు చేయాలని డిమాండ్ చేస్తూ యుటిఎఫ్ ఆధ్వర్యాన నియోజకవర్గ కేంద్రాల్లో ఉపాధ్యాయులు రణభేరి పేరిట నిరాహారదీక్షలు చేపట్టారు. చీపురుపల్లి రెవిన్యూ కార్యాలయం వద్ద, నెల్లిమర్ల ఎమ్మార్వో కార్యాలయం వద్ద చేపట్టిన దీక్షా శిబిరాలను ఆయన సందర్శించారు. తక్షణమే పిఆర్‌సి కమీషన్‌ను నియమించాలని, ఐఆర్ ప్రకటించాలని, ఇహెచ్‌ఎస్ పథకాన్ని చక్కదిద్దాలని, సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిరాహార దీక్షలో యుటియఫ్ రాష్ట్ర నాయకులు డి.రాము, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎ.సత్యశ్రీనివాస్, జిల్లా కార్యదర్శి ఎం రఘునాధరాజు, జెఎవిఆర్‌కె ఈశ్వరరావు, నాయకులు నాయకులు గొర్లె పద్మ, జి..నిర్మల, డి.భూపతి, చింతారామకృష్ణతో పాటు నాలుగు మండలాల యుటియఫ్ అద్యక్షులు కార్యదర్శులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విద్యార్థిని విచక్షణారహితంగా చితకబాదిన ప్రైవేట్ టీచర్



**కర్నూలు, పతాకం న్యూస్:** ఆలూరులోని సెయింట్ జాన్స్ స్కూల్‌లో చదువుతున్న ఒకటవ తరగతి ప్రవీణ్ అనే విద్యార్థి పై ట్యూషన్ టీచర్ రజిని అనే ఉపాధ్యాయురాలు విచక్షణారహితంగా చితకబాదడంపై తల్లిదండ్రులు ఎల్లప్ప, ఈరమ్మ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం తల్లిదండ్రులు మీడియాతో మాట్లాడుతూ .... తమ కుమారుడు సెయింట్ జాన్స్ స్కూల్లో ఒకటో తరగతి చదువుతున్నాడని ఆ పాఠశాలలోనే ఇంగ్లీష్ టీచర్ రజిని అనే ఉపాధ్యాయురాలు పనిచేస్తుందని పాఠశాల అనంతరం సాయంత్రం ట్యూషన్ పెట్టుకోవడంతో యధావిధిగా తమ కుమారుని ట్యూషన్ కి పంపగా చిన్న తప్పు చేశాడని కారణంతో తమ కుమారుడు ప్రవీణ్‌ను వీపుపై తీవ్రంగా కొట్టడంతో బాలుడు భయాందోళనలకు గురవడంతోపాటు శారీరకంగా, మానసికంగా దెబ్బతిన్నాడని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై టీచర్ రజినిపై సంబంధిత విద్యాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. టీచర్ రజిని పై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు విద్యార్థి తండ్రి ఎల్లప్ప తెలిపారు.

## భూసేకరణ పనులు సకాలంలో పూర్తి చేయాలి



**విజయనగరం, పతాకం న్యూస్:** జిల్లాలోని వివిధ ప్రాజెక్టులకు సంబంధించి భూసేకరణ పనులను ప్రాధాన్యతా క్రమంలో సకాలంలో పూర్తిచేయాలని కలెక్టర్ రామసుందర్‌రెడ్డి ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఆయన ఆయా శాఖల అధి కారులతో సమావేశం నిర్వహించారు. తోటపల్లి బ్యారేజీ, తారకరామ తీర్థసాగర్ ప్రాజెక్టులు, బాబూ జగ్జీవన్‌రాం ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు, జాతీయ రహదా రి 516(బి), కుర్దారోడ్-విజయనగరం మూడో రైల్వే లైన్, విజయనగరం నాలుగో రైల్వేలైన్ తదితర ప్రాజెక్టుల భూసేకరణపై ఆయన సమీక్షించారు. జేసీ సేతు మాధ వన్, డీఆర్వో సత్తిబాబు, ఆర్డీవోలు పాల్గొన్నారు.

## పెట్రోల్ కోసం పరుగులు



**కోనసీమ, పతాకం న్యూస్:** వంట గ్యాస్ కొరత ఏర్పడినట్లే గ్యాస్ కొరత ఏర్పడుతుందని ప్రజల్లో ఆందోళన మొదలై పెట్రోల్ బంకులవైపు ప్రజలు పరుగులు తీశారు. దీంతో బంకులు వద్ద భారీగా క్యూలు ఏర్పడ్డాయి. పెట్రోల్ కొరత ఏర్పడుతుందని పుకార్లు షికార్లు చేయటంతో బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి, మలికిపురం మండలాలలో ప్రజల్లో ఆందోళన మొదలైంది. తమ వాహనాలను పెట్రోల్ బంకులవైపు పరుగులు తీయడంతో బంకులు వద్ద భారీగా క్యూలు ఏర్పడ్డాయి. వాహనదారులు అంతా పెద్ద మొత్తంలో ఒకేసారి రావడంతో పెట్రోల్ బంకుల వద్ద వాహనాల రద్దీ అధికంగా ఏర్పడింది. మండలంలోని అంతర్వేదిపాలెం, అంతర్వేది, టేక్ సెట్టిపాలెం, మల్కిపురం మండలంలోని పలు బంకులు వద్ద వాహనదారులు పెట్రోల్ కోసం భారులు తీరి గంటలకు వేచి ఉంటున్నారు. ఇప్పటికే వంట గ్యాస్ కొరత, రేటు పెరగడంతో ఆందోళనలో ఉన్న ప్రజలు పెట్రోల్ కొరత వార్తలతో కంగారు పడుతున్నారు. ఇది కృత్రిమంగా ఏర్పాటైన కొరతనో లేక వాస్తవిక ఆధారంగా ఏర్పడిన పెట్రోల్ కొరకు తెలియక ప్రజలు గందరగోళానికి గురౌతున్నారు.

## పొగాకు కొనుగోళ్లు ప్రారంభం



**ఒంగోలు, పతాకం న్యూస్:** రాష్ట్రంలో పొగాకు వేలం బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. పొదిలి, కందుకూరు కేంద్రాల్లో కొనుగోళ్లకు పొగాకు బోర్డు అధికారులు ఏర్పాట్లు చేశారు. సగటు ధర కిలోకు రూ.270 ఇస్తేనే ఈ ఏడాది నష్టపోకుండా బయటపడతారని పొగాకు రైతులు చెప్తున్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం పొగాకు ఉత్పత్తులపై 40 శాతం జిఎస్‌టి, ఎక్సైజ్ డ్యూటీలు వేసింది. దీంతో, ఈ నెల ఒకటో తేదీ నుంచి ఒక సిగరెట్ ధర రూ.18 నుంచి రూ.25కు చేరింది. కేంద్రం వేసిన పన్నులను సాకుగా చూపి పొగాకు ఉత్పత్తులను అమ్ముకోలేకపోతున్నామని, పొగాకు పంటకు ఎక్కువ ధర ఇవ్వలేమనే ప్రచారాన్ని నెల రోజుల నుంచే ట్రేడర్లు మొదలుపెట్టారు. కర్ణాటకలో ఇటీవల వేలం ప్రారంభమైంది. మొదట్లో కిలో గరిష్ట ధర రూ.320 ఇచ్చారు. ఆ తర్వాత రూ.250కు తగ్గించారు. మన రాష్ట్రంలోని రైతులు గిట్టుబాటు ధర కోసం ఆశతో ఉన్నారు. 2024లో కిలోకు రూ.270 వచ్చింది. 2025లో రూ.220 మాత్రమే ధర లభించడంతో బ్యారన్‌కు రూ.4 లక్షల వరకూ నష్టపోయారు. దీంతో, గిట్టుబాటు ధర కోసం వేలం కేంద్రాల్లో రైతులు ఆందోళన చేసినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోలేదు. వేలం కేంద్రాలను గతేడాది సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, వైసిపి అధ్యక్షులు వైఎస్.జగన్ తదితరులు సందర్శించారు. రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వాలని, ప్రభుత్వ రంగ సంస్థలను మార్కెట్లోకి ప్రవేశపెట్టాలని కోరినా పట్టించుకోకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. రాష్ట్రంలో ఈ ఏడాది పొగాకు పంట ఉత్పత్తి 142 మిలియన్ కిలోలకు అనుమతించారు. వాతావరణం అనుకూలంగా లేనందున దిగుబడి ఎకరాకు ఏడు క్వింటాళ్లు మించలేదు. అయితే, సాగు పెరగడంతో అదనంగా మరో 90 మిలియన్ కిలోలు మార్కెట్లోకి వస్తుందని వ్యాపారులు, బోర్డు అధికారులు అంచనా వేశారు. రైతులు మాత్రం ఇంత రాకపోవచ్చంటున్నారు. కేంద్రానికి సిగరెట్లపై పన్నుల ద్వారా గత గణాంకాల ప్రకారం ఏటా రూ.40 వేల కోట్లు వచ్చేది. ఇప్పుడు అదనంగా 40 శాతం జిఎస్‌టి, ఎక్సైజ్ డ్యూటీలు విధించడంతో కింగ్‌సైజు ఒక సిగరెట్‌పై ధర రూ.18 నుంచి రూ.25కు పెరిగింది. సిగరెట్ల ధరలు పెరగడం వల్ల వ్యాపారులకు లాభాలు పెరిగాయి. అయితే, పొగాకు ధర తగ్గించే కుట్రలు ట్రేడర్లు చేస్తున్నారు. ఎక్కువ ధర ఇవ్వలేమనే ప్రచారం ముందుగానే మొదలుపెట్టారు.

## ప్రపంచశాంతిని నెలకొల్పాలి




**విజయనగరం, పతాకం న్యూస్:** ఇరాన్‌పై ఇజ్రాయిల్, అమెరికా యుద్ధాన్ని ఆపి ప్రపంచ శాంతిని నెలకొల్పాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రెడ్డి శంకర్రావు డిమాండ్ చేశారు. స్థానికఎల్‌బిజి భవన్ నుండి ఆర్‌టిసి కాంప్లెక్సు వరకు శాంతి ర్యాలీ నిర్వహించి, అనంతరం అక్కడ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆయిల్ బావుల మీద పెత్తనం సాధించడానికి అమెరికా ప్రపంచ వినాశనానికి పాల్పడిందని ఆరోపించారు. ఇజ్రాయిల్‌ను ఉపయోగించుకొని అత్యంత దుర్మార్గంగా మారణ హోమ యుద్ధాన్ని చేస్తుందని అన్నారు. యుద్ధం కారణంగా, స్కూల్ పిల్లలు, వృద్ధులు, సామాన్య ప్రజలు అనేకమంది చనిపోయారని అన్నారు. యుద్ధం కారణంగా హజ్మూర్ జలసంధి వద్ద భారత్‌కు చెందిన వాడలను ఆపివేశారని, దీనివల్ల భారత దేశంలో గ్యాస్ కొరత ఏర్పడిందని అన్నారు. ఫలితంగా హాస్టళ్లు, హోటళ్లకు గ్యాస్ నిలిచిపోయి మూతపడ్డాయన్నారు. ఇన్ని ఇబ్బందులకు కారణమైన ఇజ్రాయిల్ ను, అమెరికాను భారతదేశం ప్రోత్సహించడం సిగ్గుచేటని అన్నారు. యుద్ధం ప్రభావంగా ప్రజల ప్రాణాలు కోల్పోవడమే తప్పా ఏమాత్రం ఉపయోగం లేదని కాబట్టి యుద్ధం ఆపాలని, ప్రపంచ శాంతి కావాలని, అమెరికన్ సామ్రాజ్యవాదం పోవాలని అన్నారు. ప్రజలందరూ అమెరికన్ సామ్రాజ్యవాదం ఖండించాలని పిలుపు నిచ్చారు.

# జీవీఎంసీలో 120కి పెరగనున్న వార్డులు!



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** మహా విశాఖ నగర పాలక సంస్థ (జీవీఎంసీ) పరిధిలో వార్డుల సంఖ్య 98 నుంచి 120కి పెరగనున్నది. రాష్ట్రంలోని పట్టణ స్థానిక సంస్థల్లో జనాభా ఆధారంగా వార్డుల సంఖ్యను నిర్ణయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ జారీచేసింది. రెండు లక్షలలోపు జనాభా ఉండే నగర పంచాయతీలు, మునిసిపాలిటీల్లో 60 వార్డులు ఉండాలని, 15 లక్షలకు పైబడి జనాభా ఉన్న కార్పొరేషన్లలో వార్డుల సంఖ్య 120 ఉండాలని స్పష్టంచేసింది. దీనిని బట్టి 20 లక్షలకు పైబడిన జనాభా ఉన్న జీవీఎంసీలో వార్డుల సంఖ్య 120కి పెరగనుంది. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే కొన్ని గ్రాంట్లను పొందాలంటే స్థానిక సంస్థల్లో ఎన్నికైనా కార్యవర్గం ఉండాలనే నిబంధన ఉంది. ప్రస్తుతం రాష్ట్రంలోని అన్ని పట్టణ స్థానిక సంస్థల (నగర పంచాయతీలు, మునిసిపాలిటీలు, కార్పొరేషన్లు) కార్యవర్గాల పదవీకాలం ఈనెల 17తో ముగిసింది. తిరిగి ఎన్నికలు జరపాలంటే రిజర్వేషన్‌లు ఖరారు చేయాలి. ప్రస్తుతం కులగణన జరుగుతుండడంతో ఎన్నికల నిర్వహణకు అడ్డంకి ఏర్పడింది. రెండు, మూడు నెలల్లో కులగణన, రిజర్వేషన్లు ఖరారు పూర్తయితే వచ్చే ఆరు నెలల్లో స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహిస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇటీవల ప్రకటించారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని పట్టణ స్థానిక సంస్థలకు జనాభా ఆధారంగా వార్డుల సంఖ్యను ఖరారు చేయాలని కోరుతూ రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ కమిషనర్ పి.సంపత్‌కుమార్ ప్రభుత్వానికి ప్రతిపాదన పంపించారు. పదిహేను లక్షలకు పైబడి జనాభా ఉంటే 120 వార్డులు ఉండేలా సీడీఎంఏ చేసిన ప్రతిపాదనను ఆమోదించిన రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం గెజిట్ జారీచేసింది. రాష్ట్రంలో 15 లక్షలకు పైబడి జనాభా కలిగివున్న మునిసిపల్ కార్పొరేషన్ జీవీఎంసీ ఒక్కటే. జీవీఎంసీ పరిధిలో ప్రస్తుతం ఉన్న 98 వార్డులు ఇకపై 120కి పెరుగుతాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం పట్టణ స్థానిక సంస్థల్లో ఉండాల్సిన వార్డుల సంఖ్యను నిర్ణయిస్తూ గెజిట్ జారీచేయడంతో వార్డుల సంఖ్య ఎంతనే దానిపై ఒక స్పష్టత వచ్చినట్టయింది. అయితే గెజిట్‌లో పేర్కొన్న వార్డుల సంఖ్యకు అనుగుణంగా సరిహద్దులను నిర్ణయించాలని ఆదేశిస్తూ ప్రభుత్వం జీవీఎంసీని ఆదేశిస్తూ ప్రత్యేకంగా ఉత్తర్వులు జారీచేయాల్సి ఉంటుంది. దీనిపై ఉత్తర్వులు వస్తే టౌన్‌ప్లానింగ్ విభాగం ఆధ్వర్యంలో జీవీఎంసీ మొత్తం జనాభాను 120 వార్డులకు సమానంగా సర్దుబాటు చేయాల్సి ఉంటుంది. వార్డు సరిహద్దు నిర్ణయించేటప్పుడు భౌగోళిక సౌలభ్యం కోసం జనాభా సంఖ్యను పది శాతం అటుఇటుగా నిర్ణయించే వెసులుబాటు ఉంటుంది. 120 వార్డుల సరిహద్దులు నిర్ణయించిన తర్వాత వార్డుల స్వరూపంపై జీవీఎంసీ ప్రతి జోనల్ కార్యాలయంలో జాబితాలను ప్రదర్శించాల్సి ఉంటుంది. ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరణకు గడువు ఇచ్చి, వాటిని పరిష్కరించడం లేదా నివృత్తి చేసిన తర్వాత వార్డు సరిహద్దులతో కూడిన నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి పంపిస్తారు. ప్రభుత్వం ఆమోదం తెలిపితే వార్డుల పునర్విభజన ప్రక్రియ పూర్తవుతుంది. ఆ తరువాత రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి షెడ్యూల్ జారీచేస్తే ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైపోతుంది.

ప్రభుత్వం జారీచేసిన గెజిట్‌లో ఎంత జనాభాకు ఎన్ని వార్డులు ఉండాలని స్పష్టంగా తెలియజేసింది. ఒకవేళ పట్టణ స్థానిక సంస్థల పరిధి విస్తరించినట్టయితే వార్డుల సంఖ్య మినహాయింపు ఉంటుందని పేర్కొనడంతో జీవీఎంసీ పరిధిలో వార్డుల సంఖ్యపై స్పష్టత కరువైంది. జీవీఎంసీలో భీమిలి, పెందుర్తి మండలాల్లోని మిగిలిన గ్రామాలతోపాటు, ఆనందపురం, పద్మనాభం మండలాలను విలీనం చేయాలనే ప్రతిపాదన ప్రభుత్వం పరిశీలనలో ఉంది. ఆ నాలుగు మండలాలను విలీనం చేస్తే జిల్లా మొత్తం జీవీఎంసీ పరిధిలోనే ఉంటుందని ప్రజా ప్రతినిధులు పేర్కొంటున్నారు. ఒకవేళ విలీనానికి అనుకూలంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే మాత్రం జీవీఎంసీ పరిధిలో వార్డుల సంఖ్య 120 కాకుండా మరిన్ని పెరిగే అవకాశం ఉంటుందని అధికారులు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు. ఒకవేళ విలీనం జరగకపోతే మాత్రం 120 వార్డులతోనే ఎన్నికకు సిద్ధం కావాల్సి ఉంటుందని చెబుతున్నారు.

# ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీల అమలులో చిత్తశుద్ధేది?



**బద్వేలు, పతాకం న్యూస్:** కూటమి ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీల అమలులో చిత్తశుద్ధి లేదని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు మాదన విజయ కుమార్, ఎపి జెఎసి బద్వేలు తాలూకా కన్వీనర్ నరసింహారెడ్డి విమర్శించారు. యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ప్రభుత్వ ఉద్యోగులకు 12వ పిఆర్‌సి అమలు చేయాలని, ఆర్థిక బకాయిలను తక్షణం చెల్లించాలని, పెండింగ్ డిఎలను విడుదల చేయాలని తదితర డిమాండ్ల సాధన కోసం తాలూకా కేంద్రాలలో రిలే దీక్షల కార్యక్రమంలో భాగంగా బద్వేలులోని స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఉద్యోగ ఉపాధ్యాయులకు అనేక హామీలనిచ్చిన కూటమి ప్రభుత్వం మాట తప్పిందన్నారు. అధికారం చేపట్టగానే ఉద్యోగ, ఉపాధ్యాయులకు మెరుగైన వేతనాలను అమలు చేస్తామని, ఆర్థిక బకాయిలను రోడ్ మ్యాప్ ప్రకటించి ఆరు నెలలలోగా చెల్లిస్తామని, పెండింగ్ డిఎలను విడుదల చేస్తామని, సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామని ఆర్భాటంగా హామీలిచ్చారన్నారు. మాటలు నిజమని నమ్మి కూటమి ప్రభుత్వం గద్దెనెక్కడానికి ఉద్యోగ, ఉపాధ్యాయులు సహకరిస్తే ఉద్యోగుల అండదండలతో గద్దెనెక్కిన కూటమి పెద్దలు ఉద్యోగుల నడ్డి విరుస్తున్నారని ఆరోపించారు. పిఆర్‌సి గడువు ముగిసి ఇప్పటికే మూడేళు కావస్తుందని, కనీసం ప్రభుత్వం పిఆర్‌సి కమిషన్‌ను నియమించేందుకు ప్రయత్నించడం లేదని విమర్శించారు. గత వైసిపి ప్రభుత్వ హయంలో నియమించిన పిఆర్‌సి చైర్మన్ డాక్టర్‌మన్మోహన్ సింగ్ రాజీనామా చేసి ఏడాదిన్నర కాలం కావస్తున్నా చైర్మన్‌ను నియమించేందుకు మీనమేషాలు లెక్కిస్తుందని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి 12వ పిఆర్‌సిని ఏర్పాటు చేయడంతో పాటు పిఆర్‌సి అమలయ్యే వరకు 29 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని, ఆర్థిక బకాయిలతో పాటు పెండింగ్ డిఎలను విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఏప్రిల్ 1, 2 తేదీలలో జిల్లా కేంద్రంలో, ఏప్రిల్ 15 నుండి 19 వరకు రాష్ట్ర కేంద్రంలో రిలే దీక్షలను చేపడ తామని, అప్పటికి ప్రభుత్వం దిగిరాకపోతే ఏప్రిల్ 28న ఛలో సెక్రటేరియట్ కార్యక్రమాన్ని నిర్వహించి సెక్రటేరియట్ ను ముట్టడిస్తామని వారు హెచ్చరించారు. యుటిఎఫ్ జిల్లా మాజీ అధ్యక్షులు ఎస్.ఓబుల్ రెడ్డి, పెన్షనర్స్ అసోసియేషన్ తాలూకా ప్రధాన కార్యదర్శి కత్తి బ్రహ్మయ్య, సిఐటియు జిల్లా కార్యదర్శి కె.నాగేంద్ర, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు బండి జకరయ్య మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వ వైఖరి సరికాదన్నారు. ఉద్యోగులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఘోరంగా వైఫల్యం చెందిందని విమర్శించారు.

## హైదరాబాద్‌లో ఘోరం.. ప్రియుడి కోసం కన్నతల్లి హత్య.. ఇంట్లోనే పూడ్చిపెట్టి 10 నెలలుగా నాటకం!



**దీళిఽఎపతాకం న్యూస్:** హైదరాబాద్ నగరంలో పది నెలల క్రితం జరిగిన ఓ మహిళ హత్య కేసు మిస్టరీ వీడింది. ప్రేమకు అడ్డుచెబుతోందన్న కారణంతో కన్నతల్లినే ఓ కూతురు తన ప్రియుడితో కలిసి హత్య చేసి, మృతదేహాన్ని ఇంట్లోనే పూడ్చిపెట్టిన దారుణ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సికింద్రాబాద్ జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కౌకూర్ భరత్‌నగర్‌లో ఈ దారుణం చోటుచేసుకుంది. ఓ బైక్ ఆధారంగా పోలీసులు ఈ కేసును ఛేదించారు. వివరాల్లోకి వెళితే... భరత్‌నగర్‌కు చెందిన అంజు అనే మహిళ పది నెలల క్రితం అదృశ్యమైంది. దీంతో ఆమె పెద్ద కుమార్తె బొల్లారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. పది నెలలుగా దర్యాప్తు చేస్తున్నా కేసు కొలిక్కి రాకపోవడంతో పోలీసులు దీన్ని సవాలుగా తీసుకున్నారు. ఈ క్రమంలో అంజు చిన్న కుమార్తె ఇషిక, ఆమె ప్రియుడు మౌంటీరాజ్‌పై అనుమానంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. వారు వాడిన బైక్ ఈ కేసులో కీలక ఆధారంగా మారినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల విచారణలో ఇషిక అసలు నిజాన్ని అంగీకరించింది. ఇషిక, మౌంటీరాజ్ కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారని, సహజీవనం చేయాలని నిర్ణయించుకున్నారని తెలిసింది. అయితే, వీరి ప్రేమ వ్యవహారాన్ని తల్లి అంజు తీవ్రంగా వ్యతిరేకించింది. ప్రియుడిని వదిలేయాలని కూతురిని మందలించింది. దీంతో తమ ప్రేమకు అడ్డుగా ఉందని భావించి, తల్లిని హతమార్చాలని ఇషిక, మౌంటీరాజ్ నిర్ణయించుకున్నారు. పథకం ప్రకారం అంజును దారుణంగా హత్య చేసి, ఎవరికీ అనుమానం రాకుండా మృతదేహాన్ని అదే ఇంట్లో గొయ్యి తీసి పూడ్చిపెట్టారు.ఆ తర్వాత ఏమీ తెలియనట్లు నటిస్తూ, తన అక్కతో కలిసి తల్లి కనిపించడం లేదంటూ పోలీసులకు ఫిర్యాదు చేయించారు. ఈ దారుణ ఘటన బయటపడటంతో పోలీసులు ఇషిక, మౌంటీరాజ్‌లను అరెస్ట్ చేశారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు మెజిస్ట్రేట్ సమక్షంలో మృతదేహాన్ని వెలికితీసే పనులు చేపట్టారు. కేవలం నాలుగు రోజుల పరిచయమైన ప్రియుడి కోసం కన్నతల్లిని కూతురే కిరాతకంగా చంపడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

## ఆర్‌డిటికి ఎట్టకేలకు ఎఫ్‌సిఆర్ఎ అనుమతులు




**అనంతపురం, పతాకం న్యూస్:** అనంతపురం జిల్లాలోని రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు (ఆర్‌డిటి)కు ఫారిన్ కాంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్ (ఎఫ్‌సిఆర్ఎ) అనుమతులు ఎట్టకేలకు లభించాయి. దీంతో, ఆ సంస్థ యథావిధిగా విదేశీ నిధులు పొందేందుకు ఆటంకం తొలగిపోయింది. గతేడాది ఏప్రిల్‌లో ఆర్‌డిటికి ఎఫ్‌సిఆర్ఎ పునరుద్ధరణను కేంద్ర ప్రభుత్వం నిలిపివేసింది. దీంతో, ఆ సంస్థకు ఎఫ్‌సిఆర్ఎ కొనసాగించా లని ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా ప్రజాసంఘాలు, అన్ని రాజకీయ పార్టీలు, ప్రజలు పెద్ద ఎత్తున పోరాడడం, విషయాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకెళ్లడంతో ఆర్‌డిటికి ఎఫ్‌సిఆర్ఎను పునరుద్ధరిస్తూ అనుమతులు ఇచ్చింది. ఏడాదికి సుమారు రూ.500 కోట్ల వరకు ఆర్‌డిటికి నిధులు సమకూరుతూ ఉంటాయి. విద్య, వైద్యం, ఆరోగ్యం, దళిత, గిరిజనుల అభివృద్ధి, మహిళాభివృద్ధితోపాటు అంతర్జాతీయ ప్రమాణాలతో రూపొందించిన స్పోర్ట్సు కాంప్లెక్సు నిర్మించడమే కాకుండా గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ఆర్‌డిటి ప్రోత్సహిస్తూ వస్తోంది.

## నూరు శాతం పన్నుల వసూలు లక్ష్యం

**రాజమహేంద్రవరం, పతాకం న్యూస్:** మార్చి 31 నాటికి నూరు శాతం పన్నులు వసూలు అయ్యేలా అధికారులు పని చేయాలని పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ విఆర్.కృష్ణతేజ మైలవరపు స్పష్టం చేశారు. విధుల్లో నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తున్న అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పనితీరు మెరుగుపరచని క్షేత్రస్థాయి పంచాయతీ సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. ఆనం కళా కేంద్రంలో ఎంపిడిఒలు, పంచాయతీ సెక్రటరీలు, గ్రామ అభివద్ధి అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీల ఆర్థిక బలోపేతానికి పన్నుల వసూళ్లు కీలకమని, లక్ష్య సాధనలో అలసత్వం అసలు సహించబోమని హెచ్చరించారు. జిల్లాలో కొన్ని గ్రామ పంచాయతీలలో భారీ మొత్తంలో పన్నులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఎంపిడిఒలు ప్రత్యేక దృష్టి సారించి వసూళ్ల ప్రక్రియ వేగవంతం చేయాలని సూచించారు. పన్నులు చెల్లించని వారిపై నిబంధనల మేరకు కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఇప్పటికే ఆన్‌లైన్ ద్వారా పన్నులు చెల్లించే విధానాన్ని అమలు చేయడం వల్ల పన్ను చెల్లింపుదారులకు సౌలభ్యం కలిగిందని తెలిపారు. పట్టణ ప్రాంతాల మాదిరిగానే గ్రామీణ ప్రాంతాల్లోనూ ముందస్తు పన్ను చెల్లింపుదారులకు ప్రోత్సాహకాలు అందించే దిశగా ప్రభుత్వం ఆలోచనలు చేస్తున్నట్లు వెల్లడించారు.

## వ్యాపార అభివృద్ధికి 'సంపన్నకారి పథకం' దోహదం




**కాకినాడ, పతాకం న్యూస్:** డ్వాక్రా సంఘాల వ్యాపార అభివృద్ధికి సంపన్నకారి పథకం దోహదం చేస్తుందని కలెక్టర్ షాన్ మోహన్ సగిలి అన్నారు. కలెక్టరేట్‌లో ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాల వ్యాపారాలు ఒక స్థాయి తర్వాత మరింత అభివృద్ధి చెందడానికి అవకాశం లేకుండా పోతుందన్నారు. అందుకు అవసరమైన మార్గదర్శకం, వ్యాపార ప్రణాళికలు, మార్కెట్ అంశాలు, పెట్టుబడికి వనరులను సమకూర్చేలా సంపన్నకారి కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. రూ.12 లక్షలకుపైబడి టర్నోవర్ చేస్తున్న మహిళా సంఘ సభ్యులకు ఒక పద్ధతిగా రూపొందించిన ఇంక్యుబేషన్ సహాయం పూర్తిగా ఉచితంగా అందిస్తామన్నారు. తద్వారా వ్యాపారాలను మార్కెట్ అనుగుణంగా మరింత ఆదాయం పెంచుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ఎంపికైన వారికి కనీసం 18 నెలలు ఇంక్యుబేషన్ సహాయం అందించడంతో పాటూ లక్ష వరకు గ్రాంట్ లేదా రూ.4 లక్షల వరకు సున్నా వడ్డీ సదుపాయం, వ్యాపార పరంగా శిక్షణ, మార్కెట్ అంశాలపై అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. అర్హత కలిగిన సంఘ సభ్యులు ఏప్రియల్ 15వ తేదీలోగా సంబంధిత వెలుగు మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పథక సంచాలకులు జి.శ్రీనివాసరావు, అదనపు పథక సంచాలకులు జిలానీ, సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్ర బాక్సింగ్ పోటీల్లో సత్తా చాటిన సచిన్, కార్తీక్



**విజయనగరం, పతాకం న్యూస్:** ఈ నెల 21, 22 తేదీల్లో విశాఖపట్నం స్వర్ణ భారతి స్టేడియంలో జరిగిన బాక్సింగ్ రాష్ట్ర పోటీల్లో నగరానికి చెందిన బి.సచిన్ 70 నుంచి 75 కేజీల విభాగంలో బంగారు పతకం, డి.కార్తీక్ సిల్వర్ మెడల్ సాధించి సత్తా చాటారు. రాష్ట్ర పోటీల్లో పతకాలు సాధించిన వీరు త్వరలో నాగాపూర్‌లో జరగనున్న జాతీయ పోటీల్లో పాల్గొననున్నారు. వారిని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్ వెంకటేశ్వరావు, శాప్ బాక్సింగ్ కోచ్ ఈశ్వరరావు, వారు చదువుతున్న నేషనల్ పాఠశాల ప్రిన్సిపల్, డైరెక్టర్లు అభినందించారు.

## ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డ్ ఏర్పాటు చేయాలి



**కాకినాడ, పతాకం న్యూస్:** ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు ఇ.చంద్రావతి డిమాండ్ చేవారు. స్థానికంగా జై గణేశ ఆటో వర్కర్స్ ఆధ్వర్యంలో కార్మికులు తహశీల్దార్ శ్రీనివాస్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఉపాధి, భద్రత కల్పించాలని, పెంచిన చలానాల ఛార్జీలు, ఇన్సూరెన్స్, టోల్ గేట్, గ్రీన్ టాక్స్, ఫిట్ నెస్ సర్టిఫికెట్స్ ఫీజులను తగ్గించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉచిత బస్సు పథకంతో నష్టపోయిన కార్మికులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి లలిత, ఆటో వర్కర్స్ యూనియన్ ప్రెసిడెంట్ కోసూరి వెంకటరమణ, నాయకులు శ్రీ హరిబాబు, అబ్దుల్లా, వీర్రాజు, బాబురావు, తదితరులు పాల్గొన్నారు.

## మూడు గడ్డి వాములు దగ్ధం



**అనంతపురం, పతాకం న్యూస్:** పుట్లూరు మండల పరిధిలోని నారాయణ రెడ్డి పల్లి గ్రామానికి చెందిన దివాకర్ రెడ్డి కి చెందిన రెండు గడ్డివాములు ఆదినారాయణ రెడ్డికి చెందిన ఒక గడ్డివామి బుధవారం గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో మొత్తం మూడు వాములు దగ్ధమ య్యాయి అని దీంతో లక్ష 50 వేల రూపాయలు వరకు నష్టం వాటిలిందని రైతులు తెలిపారు. వెంటనే ఫైర్ ఇంజన్ ఇబ్బందికి ఫోన్ చేయడంతో ఫైర్ ఇంజన్ సిబ్బంది వచ్చి లోపే మొత్తం కాలిపోయిందని రైతు రైతులు తెలిపారు. బుధవారం గడ్డివాములకు అగ్గి పెట్టడం వలన మొత్తం కాలిపోయాయని రైతులు తెలిపారు.హె వారంలోపే నారాయణ రెడ్డి పల్లి గ్రామంలో గడ్డి వాములకాలు రెండోసారి జరిగింది. గ్రామస్తులు మాట్లాడుతూ మా గ్రామంలో ఎప్పుడు గడ్డివాముల అంటుకున్న దాఖలాలు లేవని ఎవరో ఉద్దేశంగా చేస్తున్నారని గ్రామస్తులు తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఆర్థిక సాయం అందించాలని రైతులు కోరారు.

# డయాబెటిస్ ఉన్నవారు వ్యాయామం చేసే విషయంలో జాగ్రత్తలు పాటించాలి..?



అధిక రక్త చక్కెర స్థాయిలు, అంటే ఆరోగ్యానికి అనుకున్నదానికంటే ఎక్కువ ప్రమాదకరమని వైద్యులు చెబుతున్నారు. దీన్ని నియంత్రించకుండా వదిలేస్తే తక్షణ సమస్యలతో పాటు దీర్ఘకాలిక దుష్ప్రభావాలు కూడా ఎదురవుతాయి. సాధారణంగా డయాబెటిస్‌తో సంబంధం ఉన్న ఈ పరిస్థితి వల్ల ఎక్కువ దాహం, తరచుగా మూత్ర విసర్జన, అలసట, చూపు మసకబారడం, తలనొప్పి, నిద్రమత్తు వంటి లక్షణాలు కనిపిస్తాయి. దీర్ఘకాలంగా రక్తంలో చక్కెర అధికంగా ఉంటే అది శరీరంలోని రక్తనాళాలు, నరాలను క్రమంగా దెబ్బతీస్తుంది. ఫలితంగా కిడ్నీ సమస్యలు, నరాల నష్టం, చూపు కోల్పోవడం, పాద సమస్యలు, గుండె సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదం పెరుగుతుంది. వీటితో పాటు రక్త చక్కెర స్థాయిలు వ్యాయామ పనితీరుపై కూడా ప్రభావం చూపుతాయి. వ్యాయామ సమయంలో అధిక చక్కెర స్థాయిలు శారీరకంగా, మానసికంగా పనితీరును తగ్గిస్తాయని వైద్యులు చెబుతున్నారు. అధిక రక్త చక్కెర ఉన్నప్పుడు శరీరానికి అవసరమైన శక్తి అందకుండా అలసట, నిస్సత్తువ పెరుగుతుంది. రక్తంలో ఉన్న చక్కెర శక్తిగా ఉపయోగపడకపోవడం వల్ల వ్యాయామం చేయడానికి ఇబ్బంది కలుగుతుంది. దీంతో శారీరక సామర్థ్యం తగ్గిపోతుంది. ఇంకా గ్లూకోజ్ స్థాయిలు అధికంగా ఉన్నప్పుడు డీహైడ్రేషన్ సమస్య వస్తుంది. ఇది కండరాల పనితీరును ప్రభావితం చేస్తుంది. నీరసం ఉన్న కండరాలు సరిగా స్పందించకపోవడం వల్ల శక్తి, సమన్వయం తగ్గిపోతాయి. అధిక రక్త చక్కెర మెటబాలిజం ప్రక్రియలను కూడా దెబ్బతీస్తుంది. దీంతో కార్బోహైడ్రేట్స్‌ను శక్తిగా మార్చే సామర్థ్యం తగ్గిపోతుంది. ఇది వ్యాయామ సమయంలో శరీరానికి అవసరమైన శక్తి సరఫరాను తగ్గిస్తుంది. వ్యాయామం తర్వాత శరీరం త్వరగా కోలుకోవడం కూడా కష్టమవుతుంది. కండరాల నొప్పులు ఎక్కువ కాలం కొనసాగడం, ఇన్‌ఫ్లమేషన్ పెరగడం వంటి సమస్యలు ఎదురవుతాయి. ఇది ఫిట్‌నెస్ పురోగతిని మందగింపజేస్తుందని వైద్యులు తెలియజేస్తున్నారు. రక్తంలో చక్కెర స్థాయిలు ఎక్కువగా ఉన్నప్పుడు మానసిక లక్షణాలు కూడా కనిపిస్తాయి. చూపు మసకబారడం, ఏకాగ్రత లోపించడం, వేగంగా కదిలే విషయాలను గుర్తించడంలో ఇబ్బంది పడటం వంటి సమస్యలు వస్తాయి. కొంతమందిలో కడుపు నొప్పి, వికారం, చిరాకు కూడా కనిపించవచ్చు.

రక్త చక్కెర స్థాయి 250-270 ఎమ్జి/డీఎల్ కంటే ఎక్కువగా ఉంటే జాగ్రత్తగా ఉండాలి. ఈ సమయంలో అధిక తీవ్రత గల వ్యాయామాలు చేయకూడదు. స్ప్రింటింగ్, హెవీ వెయిట్ లిఫ్టింగ్ వంటి వ్యాయామాలు అడ్రినలిన్ వంటి హార్మోన్లను పెంచి రక్త చక్కెరను మరింత పెంచే ప్రమాదం ఉంది. అలాంటి పరిస్థితుల్లో వైద్యుడిని సంప్రదించడం మంచిది. డయాబెటిస్ ఉన్నవారు లేదా అధిక రక్త చక్కెరకు గురయ్యే వారు వ్యాయామం చేసే సమయంలో కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. వ్యాయామం ముందు, మధ్యలో, తర్వాత రక్త చక్కెర స్థాయిలను పరిశీలించడం ద్వారా శరీర ప్రతిస్పందనను అర్థం చేసుకోవచ్చు. అలాగే తగినంత నీరు తాగడం చాలా అవసరం. వ్యాయామానికి ముందు, మధ్యలో, తర్వాత హైడ్రేటెడ్‌గా ఉండటం వల్ల రక్త చక్కెర నియంత్రణలో ఉంటుంది. అలాగే రోజులో రక్త చక్కెర తక్కువగా ఉండే సమయాన్ని ఎంచుకుని వ్యాయామం చేయడం మంచిది.

కొత్తగా వ్యాయామం ప్రారంభిస్తున్నవారు లేదా అధిక రక్త చక్కెర ఉన్నవారు నెమ్మదిగా ప్రారంభించాలి. నడక, లైట్ స్ట్రెచింగ్ వంటి తక్కువ తీవ్రత గల వ్యాయామాలతో మొదలుపెట్టి క్రమంగా పెంచాలి. ఏరోబిక్ వ్యాయామాలతో పాటు స్ట్రెంగ్త్ ట్రైనింగ్ కూడా చేయడం మంచిది. ఇది ఇన్సులిన్ సెన్సిటివిటీని మెరుగుపరచి రక్త చక్కెరను తగ్గించడంలో సహాయపడుతుంది. అలాగే వ్యాయామానికి ముందు సరైన స్నాక్ తీసుకోవడం కూడా చాలా అవసరం. వీటితో పాటు ముఖ్యంగా శరీరం ఇచ్చే సంకేతాలను గమనించాలి. వ్యాయామ సమయంలో తల తిరగడం, బలహీనత వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆపి వైద్య సలహా తీసుకోవాలి. సరైన ఆహారం, నీరు, నిద్రతో పాటు రక్త చక్కెర నియంత్రణ కూడా ఫిట్‌నెస్‌లో కీలక పాత్ర పోషిస్తుందని నిపుణులు చెబుతున్నారు.

# అల్లూరి జిల్లాలో గ్యాస్, పెట్రోల్‌కు కటకట?

## పాడేరులో మూడు పెట్రోలు బంకులు మూత




**అల్లూరి జిల్లా, పతాకం న్యూస్:** పశ్చిమాసియాలో యుద్ధ ప్రభావం జిల్లాలో వంట గ్యాస్, పెట్రోల్ సరఫరాపై చూపింది. దీంతో జిల్లాలో వాణిజ్య గ్యాస్ కొరత ఏర్పడగా, గృహావసర గ్యాస్‌పై పరిమితులు నెలకొన్నాయి. ఇక పెట్రోల్ బంకుల్లో చమురు నిల్వలు లేక మూతపడుతున్నాయి. దేశ వ్యాప్తంగా గ్యాస్ కొరత నేపథ్యంలో గత వారం నుంచే జిల్లాలో వాణిజ్య గ్యాస్ లభ్యత అరకొరగా జరుగుతున్నది. దీంతో వాణిజ్య గ్యాస్‌పై ఆధారపడి నిర్వహించే హోటళ్లు, చిరు తినుబండారాల దుకాణాలపై తీవ్ర ప్రభావం చూపింది. ధర పెరిగినా వాటిని కొనుగోలు చేసి తమ హోటళ్లు దుకాణాలు నడపాలని యజమానులు భావిస్తున్నప్పటికీ, వాణిజ్య గ్యాస్ ఆశించినంతగా లభించని పరిస్థితి నెలకొంది. దీంతో ఇప్పటికే అరకులోయ, పాడేరు ప్రాంతాల్లో పలు హోటళ్లు, చిరు తినుబండారాల దుకాణాలు మూసేశారు. అలాగే తప్పని సరి పరిస్థితుల్లో పలు హోటళ్లలో గృహావసర గ్యాస్‌ను వినియోగిస్తూ కాలం నెట్టుకు వస్తున్నారు. అయితే ఈ పరిస్థితి ఎన్నాళ్లు కొనసాగుతుందో అర్థంకాని దుస్థితి నెలకొందని పలువురు యజమానులు ఆందోళన చెందుతున్నారు. పలు హోటళ్లలో అన్నిరకాల వంటకాలు కాకుండా కేవలం బిరియాని మాత్రమే వండుతున్న పరిస్థితి ఉంది. జిల్లా కేంద్రం పాడేరులో సగం బంకుల్లో పెట్రోల్, డీజిల్ లేని పరిస్థితి నెలకొంది. జిల్లా కేంద్రంలో మొత్తం ఏడు బంకులు ఉండగా చమురు లేని కారణంగా మూడు బంకులను మూసేశారు. అలాగే విశాఖపట్నం నుంచి ఎప్పుడు డీజిల్, పెట్రోల్ వస్తుందో కూడా తెలియని పరిస్థితి నెలకొందని బంకు యజమానులు అంటున్నారు. అయితే క్రమంగా పెట్రోల్, డీజిల్ సరఫరాపైనా పరిమితులు నెలకొనే అవకాశముందని అంటున్నారు. దీంతో వాహన యజమానులు తమ అవసరాలను తగ్గించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందనే అనుమానాన్ని వ్యక్తం చేస్తున్నారు.

దేశంలో గ్యాస్ కొరత నేపథ్యంలో జిల్లాలో ప్రస్తుతానికి గృహావసర గ్యాస్‌కు తీవ్ర ఇబ్బందులు లేనప్పటికీ, పరిమితులతో సరఫరా చేస్తున్నారు. ఇన్నాళ్లూ ఉన్న 21 రోజుల బుకింగ్‌ను 45 రోజులకు పెంచడంతో పాటు పక్కాగా పాస్ బుక్, ఈకేవైసీ అయిన వినియోగదారులకు మాత్రమే అందిస్తున్నారు. గతంతో పోలిస్తే అంత స్వేచ్ఛగా గ్యాస్ ఇచ్చే పరిస్థితి లేకుండా పోయింది. జిల్లా కేంద్రంలో ఐటీడీఏ ద్వారా నిర్వహిస్తున్న ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ పరిధిలో గతంలో ప్రతి రోజు 300 నుంచి 400ల గ్యాస్ సిలిండర్లు పంపిణీ అయ్యేవి. తాజా పరిణామాల నేపథ్యం ఆ సంఖ్య సగానికి పడిపోయింది. అయితే ప్రస్తుత పరిస్థితులు మరీ ఇబ్బందిగా లేనప్పటికీ, మరో వారం దాటితే మాత్రం గృహావసర గ్యాస్ సరఫరా సైతం ఎలా ఉంటుందనేది చెప్పలేమని గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులు అంటున్నారు. దీంతో తాజా పరిణామాల నేపథ్యంలో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు.

# శత్రువులు పశ్చాత్తాప పడేవరకూ ప్రతీకార దాడులు ఆగవు: ఇరాన్



ఇరాన్: ఇరాన్ – ఇజ్రాయెల్, అమెరికా దేశాల మధ్య ఉద్రిక్తతలను తగ్గించే దిశగా చర్చలు జరుగుతున్నాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్తున్నప్పటికీ.. ఇరాన్ నుంచి వస్తోన్న సందేశాలు మాత్రం ధిక్కార ధోరణిని కనబరుస్తున్నాయి. ఆ రెండు దేశాలు చేసిన దురాక్రమణకు గానూ.. వారు పశ్చాత్తాప పడేంతవరకూ తమ దాడులు కొనసాగిస్తామని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ తేల్చిచెప్పారు. తమ మిత్ర దేశం చైనాతో ఫోన్ సంభాషణలో భాగంగా అరాగ్చీ ఈ వ్యాఖ్యలు చేసినట్టు మీడియా కథనాలు వెల్లడించాయి. ఇస్లామిక్ రిపబ్లిక్‌కు చెందిన పౌర, రక్షణ మౌలిక సదుపాయాలే లక్ష్యంగా శత్రు దేశాలు దాడులు చేయడంతోనే టెహ్రాన్‌లో అస్థిరత చోటుచేసుకుందని అరాగ్చీ తెలిపారు. 'మా లక్ష్యాలన్నీ నెరవేరడం సహా హింసాత్మక దురాక్రమణకు పాల్పడిన శత్రు దేశాలు పశ్చాత్తాప పడేవరకూ ప్రతీకార దాడులు కొనసాగుతాయి. దేశ సార్వభౌమత్వాన్ని, ప్రాదేశిక సమగ్రతను కాపాడుకోవడమే మా తొలి ప్రాధాన్యం' అని ఇరాన్ విదేశాంగ మంత్రి చెప్పారు. హోర్ముజ్ జలసంధిలో నెలకొన్న అభద్రతకు ఈ దురాగతాలే ప్రత్యక్ష కారణమని ఆయన అన్నారు. అందులో భాగంగానే హోర్ముజ్ జలసంధిని మూసివేశామని.. తాము తీసుకున్న చర్యలన్నీ అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగానే ఉన్నాయని వివరించారు. మరోవైపు.. ఇరాన్‌తో దౌత్యపరమైన చర్చలకు అమెరికా సంకేతాలిస్తుండగా.. టెల్ అవీవ్‌లోని ఇజ్రాయెల్ గూఢచర్య కేంద్రాలే లక్ష్యంగా వరుస దాడులు ప్రారంభించినట్టు ఐఆర్‌జీసీ తెలిపింది. ఇరాన్‌లో ప్రముఖ వ్యక్తులతో తమ చర్చలు కొనసాగుతున్నాయని, ఇది పాలనాపరమైన మార్పునకు సంకేతమని యూఎస్ ప్రెసిడెంట్ ట్రంప్ పేర్కొన్న తరుణంలోనే ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం.




# సెమీస్‌లో భారత్, ఆస్ట్రేలియా అమీతుమీ



ఐపీఎల్ 2026 మరో మూడు రోజుల్లో ప్రారంభం కానుంది. అయితే పలువురు విదేశీ ప్లేయర్లు ఇప్పటికీ ఆయా జట్లతో చేరలేదు. ముఖ్యంగా ఢిల్లీ క్యాపిటల్స్ స్టార్ ప్లేయర్ మిచెల్ స్టార్క్ ఆడే విషయంలో అనిశ్చితి కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో టీమిండియా మాజీ క్రికెటర్ సౌరభ్ గంగూలీ కీలక వ్యాఖ్యలు చేశాడు. నాణ్యమైన ఆటగాళ్లు చివరి నిమిషంలో జట్టుకు దూరమైతే.. టీమ్ బ్యాలెన్స్ మీద అది ప్రభావం చూపిస్తుందని తెలిపాడు. 'భారత జట్టును తయారు చేయడం కంటే.. ఐపీఎల్‌కు జట్టును రూపొందించడమే చాలా కష్టం. ఎందుకంటే భారత జట్టుకు అత్యున్నత ఆటగాళ్లు ఎల్లవేళలా అందుబాటులో ఉంటారు. ఐపీఎల్‌లో 10 జట్లున్నాయి. నాణ్యమైన క్రికెటర్లు పాల్గొనకపోతే జట్టు సమతూకం దెబ్బతింటుంది. జట్టుకు ఎవరైనా ఆటగాడు దూరమైనప్పుడు ప్రత్యామ్నాయ క్రికెటర్ల లభ్యత ఇబ్బంది పెడుతుంది. ఐపీఎల్‌కు మిచెల్ స్టార్క్, పతిరన దూరమైతే.. ఆ లోటును పూరించడం చాలా కష్టం' అని గంగూలీ అన్నాడు. వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌పైన కూడా దాదా మాట్లాడాడు. 'పనిభారం నిర్వహణ చాలా ముఖ్యం. ఎందుకంటే ఆటగాళ్లు చాలా క్రికెట్ ఆడుతారు. శారీరక శ్రమ కంటే మానసిక అంశమే ప్రధాన పాత్ర పోషిస్తుంది. ఇంటికి, కుటుంబాలకు దూరంగా ఉండటం ఎప్పుడూ సులభమైన విషయం కాదు' అని గంగూలీ పేర్కొన్నాడు.

# ఐపీఎల్ చరిత్రలో భారీ డీల్..

## చేతులు మారిన రాజస్థాన్ రాయల్స్



ఐపీఎల్2026 మరో నాలుగు రోజుల్లో ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో ఐపీఎల్ చరిత్రలోనే భారీ డీల్ కుదిరినట్లు కనిపిస్తోంది. రాజస్థాన్ రాయల్స్ ఫ్రాంచైజీ (=ఘియిఖర్ష్టుఅ =శీఘ్రశ్రీం)ని కన్సార్టియం అనే సంస్థ కొనుగోలు చేసినట్లు జాతీయ మీడియాలో కథనాలు వచ్చాయి. ఇది అమెరికా వ్యాపారవేత్త కల్ సోమానీ నేతృత్వంలోని పని చేస్తోంది. 1.63 బిలియన్ డాలర్లతో ఈ ఫ్రాంచైజీని దక్కించుకున్నట్లు సమాచారం. ఈ విలువ మన ఇండియన్ కరెన్సీలో రూ.15వేల కోట్లు. దీంతో ఒక బిలియన్ డాలర్లకు విక్రయించిన తొలి ఐపీఎల్ జట్టుగా రాజస్థాన్ చరిత్ర సృష్టించింది. ఇక ఈ భారీ డీల్ పై త్వరలో అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది.

నివేదికల ప్రకారం.. ఇప్పటికే ఇరువర్గాల మధ్య ఒప్పందంపై సంతకాలు జరిగాయని, 2026 ఐపీఎల్ సీజన్ (ఖ్రూ) తర్వాత కొత్త యజమానులకు ఈ ఫ్రాంచైజీ అప్పగించనున్నారు. ఇంట్రూఎడ్జ్, ట్రుయో, ట్రుయో.ఏఐ, అకాడెమియన్ సంస్థల వ్యవస్థాపకుడు సోమానీ. ఇక కన్సార్టియంలో అమెరికా వ్యాపారవేత్త, ప్రముఖ రిటైల్ సంస్థ వాల్‌మార్ట్ ఛైర్మన్ రాబ్ వాల్టన్ కూడా ఉన్నారు. అగ్రరాజ్యానికే చెందిన మరో వ్యాపార కుటుంబం హాంప్ కుటుంబం కూడా ఈ గ్రూప్‌లో భాగం. నేషనల్ ఫుట్‌బాల్ లీగ్ (ఎన్ఎఫ్ఎల్) జట్టు డెట్రాయిట్ లయన్స్‌లో మెజారిటీ వాటాలు హాంప్ కుటుంబం కలిగి ఉంది.

మరోవైపు ఫ్రాంచైజీలను అమ్మాలని రాజస్థాన్ రాయల్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు కొంతకాలం క్రితం నిర్ణయం తీసుకున్నాయి. అయితే కొలంబియా పసిఫిక్ క్యాపిటల్స్ పార్టనర్స్ (సీపీసీపీ) కన్సార్టియం నుంచి రూ.16వేల కోట్ల ఆఫర్ వచ్చినా.. రాజస్థాన్ తిరస్కరించిందని ఇటీవల మీడియా కథనాలు వచ్చాయి. ప్రస్తుతం ఈ ఫ్రాంచైజీలో ఎమెర్జింగ్ మీడియా వెంచర్స్ అధినేత మనోజ్ బదాలె వాటా 65 శాతం కాగా.. రెడ్‌బర్డ్ క్యాపిటల్‌కు మిగతా వాటా ఉంది. ఇదిలా ఉండగా, గాయం కారణంగా ఇంగ్లీష్ ఆల్–రౌండర్ సామ్ కరన్ టోర్నమెంట్ నుంచి వైదొలగడంతో అతని స్థానంలో శ్రీలంక ఆల్–రౌండర్ దాసున్ షనకను తీసుకుంటున్నట్లు రాజస్థాన్ ప్రకటించింది.




# రాజమౌళి-మహేశ్ మూవీ కోసం హైదరాబాద్‌లో వెలసిన 'వారణాసి'



దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి, సూపర్ స్టార్ మహేశ్ బాబు కాంబినేషన్‌లో రానున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'వారణాసి'పై అంచనాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. తాజాగా ఈ సినిమా కోసం హైదరాబాద్‌లో నిర్మిస్తున్న ఒక భారీ సెట్‌కు సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. పవిత్ర పుణ్యక్షేత్రమైన వారణాసిలోని గంగా నది తీరాన్ని, అక్కడి పురాతన కట్టడాలను తలపించేలా ఈ సెట్‌ను తీర్చిదిద్దుతున్నట్లు తెలుస్తోంది.

ఈ చిత్రంలో ఒక కీలకమైన సన్నివేశాన్ని వారణాసి నేపథ్యంలో చిత్రీకరించేందుకు రాజమౌళి ఈ ఏర్పాట్లు చేస్తున్నారని సినీ వర్గాల సమాచారం. తన సినిమాలలో లొకేషన్లకు, సెట్టింగులకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చే రాజమౌళి, ఈసారి కూడా తన మార్క్‌ను చూపిస్తున్నారు. ప్రపంచ యాత్ర (గ్లోబ్ ట్రాటింగ్) నేపథ్యంలో సాగే అడ్వెంచర్ కథ అయినప్పటికీ, అందులో భారతీయ సంస్కృతిని, ఆధ్యాత్మికతను ప్రతిబింబించేలా వారణాసిని జోడించడం విశేషం.

ఈ సినిమాలో మహేశ్ బాబు ఒక సాహసికుడి పాత్రలో కనిపించనున్నారు. ఇందుకోసం ఆయన ఇప్పటికే పొడవాటి జుట్టు, గడ్డంతో సరికొత్త మేకోవర్‌లో సిద్ధమయ్యారు. ఆయన న్యూ లుక్ ఫొటోలు కూడా గతంలో వైరల్ అయ్యాయి. ప్రస్తుతం తన పాత్రకు అవసరమైన ఫిజిక్ కోసం కఠినమైన శిక్షణ తీసుకుంటున్నారు. భారీ బడ్జెట్‌తో అంతర్జాతీయ ప్రమాణాలతో తెరకెక్కుతున్న ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

# ఏప్రిల్ నుంచి మెగా 158 షూటింగ్!



మెగాస్టార్ చిరంజీవి అభిమానులకు ఆసక్తికరమైన వార్త. 'వాల్తేరు వీరయ్య' వంటి బ్లాక్‌బస్టర్ విజయం తర్వాత చిరంజీవి, డైరెక్టర్ బాబీ కొల్లి కాంబినేషన్ మరోసారి పునరావృతం కానుంది. మెగాస్టార్ కెరీర్‌లో 158వ చిత్రంగా రానున్న ఈ సినిమా షూటింగ్ ఏప్రిల్ రెండో వారం నుంచి ప్రారంభం కానున్నట్టు తెలుస్తోంది. ఈ నెలాఖరులోగా సినిమాకు సంబంధించిన అధికారిక పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. తొలి షెడ్యూల్‌లో చిరంజీవిపై కొన్ని సోలో ఎంట్రీ సన్నివేశాలను, ఆ వెంటనే ఓ మాస్ సాంగ్‌ను చిత్రీకరించాలని దర్శకుడు ప్లాన్ చేసినట్లు సమాచారం. ఈ చిత్రాన్ని కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై వెంకట్ కె నారాయణ, లోహిత్ భారీ బడ్జెట్‌తో నిర్మించనున్నారు. ఇటీవల 'మన శంకర వరప్రసాద్ గారు' చిత్రంతో విజయాన్ని అందుకున్న చిరంజీవిని ఈ సినిమాలో పూర్తిస్థాయి మాస్ అవతార్‌లో చూపించనున్నట్టు తెలుస్తోంది. అయితే కేవలం మాస్ అంశాలకే పరిమితం కాకుండా కుటుంబ భావోద్వేగాలకు కూడా పెద్దపీట వేస్తూ బాబీ ఓ ప్రత్యేకమైన కథను సిద్ధం చేశారని చిత్ర వర్గాలు చెబుతున్నాయి. చిరంజీవిని సరికొత్తగా ప్రజెంట్ చేయాలనే లక్ష్యంతో ఈ ప్రాజెక్ట్‌ను రూపొందిస్తున్నారు. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన 'వాల్తేరు వీరయ్య' భారీ విజయం సాధించడంతో ఈ కొత్త ప్రాజెక్ట్‌పై అభిమానుల్లో, ఇండస్ట్రీలోనూ అంచనాలు రెట్టింపయ్యాయి.

# సర్కార్4లో ఐశ్వర్య రాయ్ నటించడం లేదు



రామ్ గోపాల్ వర్మ దర్శకత్వంలో వచ్చిన 'సర్కార్' చిత్రం నుండి త్వరలో 4వ భాగం రానుంది. ఈ నేపథ్యంలో, చిత్ర తారాగణంపై వస్తున్న వార్తలకు తాజాగా ఆర్జీవీ చెక్ పెట్టారు. ఈ సినిమాలో ఐశ్వర్య రాయ్ బచ్చన్ నటిస్తున్నారనే ప్రచారాన్ని ఆయన ఖండించారు. ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడారు. 'సర్కార్ 4లో ఐశ్వర్య రాయ్ నటించడం లేదు. అమితాబ్ బచ్చన్, అభిషేక్ బచ్చన్ మాత్రమే ఈ ప్రాజెక్టులో భాగం కానున్నారు' అని స్పష్టం చేశారు. 'మునుపటి భాగాల కంటే 'సర్కార్ 4ః ప్రపంచం చాలా పెద్దదిగా ఉంటుంది. కథలో లోతు ఎక్కువగా ఉండటమే కాకుండా, ప్రతి సన్నివేశాన్ని చాలా వివరంగా చూపిస్తాను. తెర వెనుక జరిగే రాజకీయ వ్యూహాలను భారీ స్థాయిలో ప్రెజెంట్ చేయబోతున్నాను.' అని వివరించారు. ఈ సినిమా షూటింగ్ వచ్చే నెల నుండి ప్రారంభం కాబోతుందని కూడా పేర్కొన్నారు.






Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**